RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 224 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | ఆదివారం, మార్చి,1, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 224 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Sunday,March,1, 2026 | PAGES : 8 RS : 4 /- |




## తుపాకీ శిక్షణలో కిమ్ కూతురు

### ఉత్తర కొరియా తదుపరి బాస్

# ఈమేనా..!

- రైఫిల్ తో గురిచూస్తున్న కిమ్ కుమార్తె ఫొటోలు విడుదల చేసిన ప్రభుత్వం
- జూ యే కు వారసత్వ శిక్షణ మొదలైందంటున్న దక్షిణ కొరియా నిఘా సంస్థలు
- సోదరికి పార్టీలో కీలక పదవి కట్టబెట్టిన ఉత్తర కొరియా నియంత

ఢిల్లీ,: ఉత్తర కొరియాలో కిమ్ జోంగ్ ఉన్ వారసత్వంపై ఇటీవలి కాలంలో చర్చ జరుగుతున్న విషయం తెలిసిందే. నియంత కిమ్ తర్వాత పాలనా బాధ్యతలను ఆయన కూతురు జూ యే చేపడతారని ప్రచారం జరుగుతోంది. కొంతకాలంగా అధికారిక కార్యక్రమాలకు కిమ్ తన వెంట కూతురును కూడా తీసుకు వెళుతున్నారు. ఈ నేపథ్యంలో తన వారసురాలిగా తీర్చిదిద్దేందుకు జూ యే కు కిమ్ శిక్షణనిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఉత్తరకొరియా అధికారిక న్యూస్ ఏజెన్సీ విడుదల చేసిన ఓ ఫొటో అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారింది. జూ యే తన తండ్రి కిమ్ అడుగుజాడల్లో నడుస్తూ, ప్రొఫెషనల్ షూటర్ లాగా జూ యే రైఫిల్ పట్టుకుని గురిచూస్తున్నట్లు ఈ ఫొటోలో కనిపిస్తోంది.





## ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు

## నాంపల్లి కోర్టుకు హాజరైన

# సీఎం రేవంత్

హైదరాబాద్,తెలంగాణ దిశ :హైదరాబాద్‌లోని నాంపల్లి ప్రజా ప్రతినిధుల కోర్టుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం హాజరయ్యారు. గతంలో నమోదైన ఎన్నికల కోడ్ ఉల్లంఘన, కోవిడ్ నిబంధనల ఉల్లంఘన కేసుల విచారణ నేపథ్యంలో న్యాయమూర్తి ఎదుట ఆయన కోర్టులో హాజరై విచారణను ఎదుర్కొన్నారు. 2019లో జరిగిన హుజూర్‌నగర్ ఉప ఎన్నికల సమయంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా, అప్పటి ఎంపీలైన రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి తరఫున భారీ ర్యాలీ నిర్వహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ర్యాలీలో సుమారు 40 కార్లు, డీజే సౌండ్ సిస్టమ్‌లతో ప్రచారం నిర్వహించారని ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. వారు ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని ఆరోపిస్తూ ఎన్నికల అధికారులు తెలిపారు. ఇక 2021లో కరోనా మహమ్మారి సమయంలో తెలంగాణ ప్రభుత్వం విధించిన కోవిడ్ నిబంధనలను పాటించకుండా ఓ పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొన్నారని కూడా రేవంత్‌రెడ్డిపై ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనకు సంబంధించి కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. కోవిడ్ సమయంలో ప్రజా సమావేశాలపై పరిమితులు ఉన్నప్పటికీ వాటిని ఉల్లంఘించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ రెండు ఘటనలకు సంబంధించి ఎన్నికల సంఘం అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘన, కోవి డ్‌మార్గదర్శకాలు పాటించకపోవడంవంటి అం శాలపై కేసులు నమోదు చేశారు. ఈ కేసుల విచారణలో భాగంగానాంపల్లి ప్రజాప్రతిని ధుల కోర్టు న్యాయమూర్తి ఎదుట సీఎం రేవం త్‌రెడ్డి హాజరయ్యారు. కోర్టు విచారణలో తదు పరి విచారణ తేదీని నిర్ణయించే అవకాశం ఉంది.



## మరోమారు యుద్ధమేఘాలు

### ఇరాన్‌పై ఇజ్రాయిల్ క్షిపణి

# దాడులు

### ప్రతిదాడులకు దిగిన ఇరాన్

టెలిఅవీవ్, ఫిబ్రవరి28 : మరోమారు యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. ఇరాన్‌పై ఇజ్రాయిల్ క్షిపణ దాడులకు దిగింది. అణు ఒప్పందంపై అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ క్షిపణి దాడులకు పాల్పడింది. టెహ్రాన్ అంతటా పేలుళ్లు విని పించాయి. దీంతో ఆ ప్రాంతంలో భారీగా పొగ వ్యాపించింది. అమెరికా సాయంతోనే ఇజ్రాయెల్ ఈ దాడులు చేసినట్లు తెలుస్తోంది. ఈ దాడిని తామే చేశామని టెల్‌అవీవ్ ప్రకటించింది. శత్రు దేశం నుంచి పొంచివున్న ముప్పును తప్పించేందుకు ఈ దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి కట్జ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ నివాసం, నిఘా ప్రధాన కార్యాలయం సహా మొత్తం 30 ప్రాంతాలు లక్ష్యంగా ఈ దాడులు జరిగాయి.

## లండన్ అగ్నిప్రమాదంలో..

# నిజామాబాద్ యువకుడు మృతి

**నిజామాబాద్,తెలంగాణ దిశ :**లండన్‌లోని క్రొయిడాన్ ప్రాంతంలో మూడు రోజుల క్రితం జరిగిన అగ్ని ప్రమాదంలో ఎపి కి చెందిన గొంతి అభిషేక్ ప్రాణాలు కోల్పోగా, తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్న నిజామాబాద్‌కు చెందిన సాయి శ్రీకర్‌ను వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. ఒకే రూమ్‌లో ఉంటున్న వీరు ఎంబీఏ పూర్తిచేసి పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తున్నట్లు సమాచారం. అయితే, ఈ అగ్నిప్రమాదం నుంచి తప్పించుకున్న మరో విద్యార్థి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. లండన్ డుప్పాస్ హిల్స్ టెర్రాస్‌లోని రెండు అంతస్తుల నివాసంలో రెండు రోజుల క్రితం గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. గ్రౌండ్ ఫ్లోర్ నుంచి మొదటి అంతస్తుకు మంటలు, దట్టమైన పొగ వ్యాపించడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో సాయి శ్రీకర్ అవయవాలను దానం చేసేందుకు అంగీకరించినట్లు నిజామాబాద్‌లోని శ్రీనగర్ కాలనీలో నివాసముంటున్న అతడి తల్లిదండ్రులు వెల్లడించారు.

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇండ్లతో పాటు ఇప్పుడు దేవాలయాలు, మఠాలను సైతం కూల్చేందుకు కుట్రలు చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ల హరీశ్ రావు మండిపడ్డారు. కోకాపేట్ నియోపోలిస్‌లోని విశాఖ శారద పీఠం, రాజశ్యామల అమ్మవారి ఆలయాన్ని రెవెన్యూ, పోలీసు అధికారులు అకస్మాత్తుగా చుట్టుముట్టి ఖాళీ చేయాలంటూ భయాందోళనలకు గురిచేస్తున్న నేపథ్యంలో హరీశ్‌రావు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ఆలయాన్ని సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వినాశకాలే విపరీత బుద్ధి అన్నట్లు రేవంత్ రెడ్డి పాలన తయారైందని హరీశ్‌రావు అన్నారు. అడ్డగోలు వ్యవహారాలకు, అక్రమాలకు పాల్పడుతున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఏకంగా దేవాలయాలు, మఠాలను కూడా కూల్చే స్థాయికి దిగజారిందని విమర్శించారు. 2019లో కేసీఆర్ ప్రభుత్వంలో కోకాపేట సర్వే నెంబర్ 240లో విశాఖ శారద పీఠానికి చట్టబద్ధంగా క్యాబినెట్ ఆమోదంతో రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించామని తెలిపారు. పీఠం నిర్వాహకులు ప్రభుత్వానికి 1.05 కోట్లు చెల్లించి రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నారని పేర్కొన్నారు. అలాగే హెచ్‌ఎండీఏ కు రూ. 23 లక్షలు చెల్లించి అనుమతులు, విద్యుత్ కనెక్షన్ అన్నీ తీసుకున్నారని చెప్పారు. ఇక్కడ అద్భుతమైన శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారి దేవాలయం, గోశాల, నిత్య అన్నదాన సత్రం, వేద పాఠశాల నిర్మించారని అన్నారు. హైకోర్టు న్యాయమూర్తులు, అధికారుల సమక్షంలో పెద్ద స్వామీజీ చేతుల మీదుగా ప్రతిష్టా కార్యక్రమం జరిగిందని గుర్తుచేశారు.



## విశాఖ శారదాపీఠం ఆలయం కూల్చివేస్తే

# అడ్డుకుంటాం

- చట్టబద్ధంగా కేటాయించిన రెండెకరాలు లాగేసుకుంటారా
- దేవాలయాలు, మఠాలను మింగాలన్న ఆలోచన ఎందుకు
- కోకాపేట శారదాపీఠం భూముల స్వాధీనంపై హరీష్ ఆగ్రహం

## చెడు మాత్రమే ఆచరించాలనుకునే వారికి మా సమాధానం

# ఇలాగే ఉంటుంది

### ఇరాన్‌కు ట్రంప్ తాజా వార్నింగ్




ఢిల్లీ,:మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. ఇరాన్ అణు కార్యక్రమాలను పూర్తిగా నిర్వీర్యం చేసే లక్ష్యంతో అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా భారీ సైనిక దాడులకు దిగాయి. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా ఈ దాడులను ధృవీకరించారు. గతంలో ధ్వంసం చేసిన అణు కేంద్రాలను ఇరాన్ రహస్యంగా పునర్నిర్మిస్తోందని, దీర్ఘ శ్రేణి బాలిస్టిక్ క్షిపణులను అభివృద్ధి చేస్తోందని ఆరోపిస్తూ ఈ ఆపరేషన్ చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. ఇరాన్ ఎప్పటికీ అణు ఆయుధాన్ని కలిగిఉండకూడదన్నదే తమప్రధానలక్ష్యమని ట్రంప్ స్పష్టం చేశారు. మాట వినకుంటే ఇరాన్ ను సర్వనాశ నం చేస్తామని తీవ్రంగా హెచ్చరించారు. అణు ఆయుధాలను సమకూర్చుకోవాలన్న దుర్మార్గపు ఆలోచనలను విడనాడాలని పేర్కొన్నారు. ప్రపంచంలో ఉగ్రవాదానికి ఇరాన్ అతిపెద్ద మద్దతుదారుఅనిఅభివర్ణించారు. ఉగ్రవాద పాలనలోఉన్న దేశాలవద్ద అణు ఆయుధాలు ఎప్పటికీ ఉండకూడదని స్పష్టం చేశారు. చెడు మాత్రమే ఆచరించాలనుకునేవారికి మా సమాధానం ఇలాగే ఉంటుంది అంటూ ట్రంప్ తాజాగాఘాటుహెచ్చరికలు చేశారు.




## కేబీఆర్ పార్క్ చుట్టూ

# 7 ఫ్లైఓవర్లు

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** హైదరాబాద్‌లో సిగ్నల్ ఫ్రీ జంక్షన్‌లు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని సీపీ సజ్జనార్ వెల్లడించారు. హెచ్ సిటీ ప్రాజెక్టులో భాగంగా కేబీఆర్ పార్కు వద్ద నిర్మిస్తున్న ఫ్లైఓవర్లు, అండర్ పాస్ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. కేబీఆర్ పార్కు చుట్టూ రానున్న 2 ఏళ్లలో 7 ఫ్లైఓవర్లు, 7 అండర్‌పాస్‌లు అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా రాత్రివేళల్లో పనులు కొనసాగుతాయని తేల్చి చెప్పారు. విశ్వ నగరంగా మారిన హైదరాబాద్‌లో ట్రా ఫిక్‌ను ఎప్పటికప్పుడు సమర్థవంతంగా నియంత్రించేందుకు.. రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతున్నాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత గత 12 ఏళ్లలో హైదరాబాద్ నగరంలో ఎన్నో ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు, స్టీల్ బ్రిడ్జిలను నిర్మించారు. దీంతో రోజురోజుకూ పెరుగుతున్న నగర జనాభాకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో పీక్ అవర్స్‌లో గంటల తరబడి ట్రాఫిక్‌లో వేచిచూడాల్సిన దుస్థితి నగరవాసులకు కలుగుతోంది. అయితే వాటిని కూడా తప్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.



## పెరిగిన మిర్చి ధరలతో

# రైతుల్లో ఆనందం

### గతంలో ఎప్పుడూ లేనంతగా పెరిగినట్లు వెల్లడి

**వరంగల్,తెలంగాణ దిశ :**మిర్చి రైతులకు మళ్లీ చాలాకాలం తరవాత మద్దతు ధరలను మించి ధరలు దక్కుతున్నాయి. ఆలస్యంగా అయినా ధరలు దక్కడంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వరంగల్ చుట్టుపక్కల రైతులు మిర్చిని నాణ్యతతో పండిస్తున్నట్లు వెల్లడించారు. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో చపాట దేశీ మిర్చి ధరలు పెరిగాయి. నాలుగు సంవత్సరాల తరువాత దేశీ మిర్చి ధరలు పుంజుకున్నాయని రైతులు అన్నారు. ఈ–నామ్ విధానంలోని ఈ–వేలంలో వ్యాపారులు క్వింటాకు గరిష్టంగా రూ.18,789, కనిష్టంగా రూ.17,521, సగటున రూ.18,489 ధరల చొప్పున ఖరీదులు చేశారు. మార్కెట్‌లో ఈ నెల మొదటివారంలో మిర్చి సీజన్ ప్రారంభం కాగా, తొలుత క్వింటాకు రూ.16,300 నుంచి రూ.16,800 వరకే సగటు ధరలు ఉన్నాయి. మార్కెట్‌కు వరుస సెలవుల అనంతరం ఈనెల 18న సగటు ధర రూ.17,011ఉండగా క్రమంగా పెరుగుతూ తాజాగా రూ.18,489కి చేరింది. ఖమ్మం, వరంగల్ మార్కెట్ల రాబడులు, కోల్డ్ స్టోరేజీల్లో ఉన్న నిల్వలు, ఇతర దేశాల ఎగుమతుల అంశాలన్నీ ఇక్కడి మిర్చి ధరలను ప్రభావితం చేస్తున్నట్లు వ్యాపారులు విశ్లేషిస్తున్నారు. 2021–22లో మిర్చి ధరలు, ముఖ్యంగా దేశీ మిర్చి ధర క్వింటాకు లక్ష రూపాయల వరకు పలికింది.

# సంపాదకీయం

## బీజేపీలో యువతరం..

భారతీయ జనతా పార్టీలో తరాల మార్పు మొదలైంది. కొంతకాలంగా వినిపిస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ, బీజేపీ జాతీయ సారథ్య బాధ్యతలను యువ నాయకుడు నితిన్ నబిన్‌కు అప్పగించడం భారత రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. కేవలం 45 ఏళ్ల వయసులో ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీకి అధ్యక్షుడవ్వడం అంటే అది సామాన్య విషయం కాదు. ఇది కేవలం ఒక నియామకం మాత్రమే కాదు, రాబోయే రెండు దశాబ్దాల రాజకీయాలను శాసించేలా మోదీ–షా ద్వయం రచించిన ఒక పకడ్బందీ వ్యూహం అని చెప్పొచ్చు.నితిన్ నబిన్ ఎదుగుదల వెనుక వారసత్వ రాజకీయాల నీడ లేదు.. కేవలం కఠోర శ్రమ, అంకితభావం మాత్రమే ఉన్నాయి. ఆయన రాజకీయ ప్రస్థానం బీహార్ గల్లీల నుండి మొదలైంది. భారతీయ జనతా యువమోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శిగా, బీహార్ యువమోర్చా అధ్యక్షుడిగా ఆయన పార్టీ క్యాడర్‌ను కింది స్థాయి నుండి నిర్మించారు. 2006లో మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన నితిన్, అప్పటి నుండి వెనుదిరిగి చూడలేదు. పాట్నాలోని బంకీపూర్ నియోజకవర్గం నుంచి వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందడం ఆయన ప్రజాదరణకు నిదర్శనం. బీహార్ ప్రభుత్వంలో రోడ్లు, న్యాయశాఖ, పట్టణాభివృద్ధి వంటి కీలక శాఖల మంత్రిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. కేవలం పార్టీని నడపడమే కాకుండా, ప్రభుత్వాన్ని ఎలా నడపాలో కూడా తెలిసిన నాయకుడు కావడంతో అధిష్టానం ఆయన వైపు మొగ్గు చూపింది.బీజేపీలో ఎంతోమంది సీనియర్లు, హేమాహేమీలు ఉన్నప్పటికీ నితిన్ నబిన్ వైపే మొగ్గు చూపడానికి ప్రధాన కారణం ఆయనకున్న 'సమన్వయ కర్త' అనే ఇమేజ్. మోదీ–షాల వ్యూహాలను తు.చ. తప్పకుండా అమలు చేయడంలో ఆయన దిట్ట. పార్టీ గీసిన గీతను దాటకుండా, అందరినీ కలుపుకుపోవడం ఆయన ప్రత్యేకత. ఆయన కాయస్థ సామాజిక వర్గానికి చెందినవారు. ఇది రాజకీయంగా తటస్థ వర్గంగా పరిగణించబడుతుంది. ఏ ఇతర బలమైన కుల వర్గాలతోనూ ఘర్షణ లేని నేపథ్యం కావడం వల్ల, దేశవ్యాప్తంగా ఉన్న వివిధ కుల సమీకరణాలను సమన్వయం చేయడం ఆయనకు సులభమవుతుంది. కాంగ్రెస్ పార్టీ 80 ఏళ్లు పైబడిన సీనియర్ నేత మల్లికార్జున ఖర్గే సారథ్యంలో నడుస్తుంటే, బీజేపీ 45 ఏళ్ల యువకుడిని తెరపైకి తెచ్చి దేశ యువతకు ఒక బలమైన సంకేతాన్ని పంపింది.నితిన్ నబిన్ సామర్థ్యంపై అధిష్టానానికి పూర్తి నమ్మకం కలిగించింది 2023 ఛత్తీస్‌గఢ్ ఎన్నికలే. అప్పట్లో అక్కడ కాంగ్రెస్ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ తిరుగులేని శక్తిగా ఉండేవారు. సర్వేలన్నీ బీజేపీ ఓడిపోతుందని చెప్పాయి. ఆ క్లిష్ట సమయంలో పార్టీ ఇన్‌చార్జ్‌గా వెళ్లిన నబిన్, తన మైక్రో మేనేజ్‌మెంట్ వ్యూహంతో అద్భుతం చేశారు. గ్రౌండ్ లెవల్‌లో బూత్ కమిటీలను బలోపేతం చేసి, కాంగ్రెస్ కోటను బద్దలు కొట్టి బీజేపీని అధికారంలోకి తెచ్చారు. ఇటీవల ఢిల్లీలో బీజేపీ తిరిగి తన ఉనికిని చాటుకోవడంలో కూడా ఆయన కీలక పాత్ర పోషించారు. కష్టమైన టాస్క్‌లను సైతం సైలెంట్‌గా పూర్తి చేసే 'ట్రబుల్ షూటర్'గా ఆయన పేరు తెచ్చుకున్నారు.నితిన్ నబిన్ ముందు ఇప్పుడు పూలపాన్పు లేదు, ముళ్ల బాట ఉంది. బీజేపీకి ఇప్పటికీ సవాల్‌గా ఉన్న దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీని విస్తరించడం ఆయన ప్రాథమిక లక్ష్యం. త్వరలో జరగబోయే బెంగాల్, ఉత్తరప్రదేశ్, అస్సాం ఎన్నికల్లో పార్టీ విజయం సాధించడం ఆయన సారథ్యానికి పరీక్షగా నిలవనుంది. 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి దేశంలో కొత్తగా చేరే కోట్లాది మంది యువ ఓటర్లను బీజేపీ వైపు తిప్పుకోవడం కోసం ఆయన తనదైన శైలిలో పార్టీని డిజిటల్, క్షేత్రస్థాయిలో ఆధునీకరించాల్సి ఉంది. తిన్ నబిన్ 1980 మే 23న జార్ఖండ్‌లోని రాంచీలో జన్మించారు. ఆయన తండ్రి నబిన్ కిశోర్ ప్రసాద్ సిన్హా, తల్లి మీరా సిన్హా. కిశోర్ సిన్హా సీనియర్ బీజేపీ నాయకుడు. ఆయన పాట్నా వెస్ట్ నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు బీహార్ శాసనసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. కాగా, నితిన్ నబిన్ 1996లో పాట్నాలోని సెయింట్ మైఖేల్స్ హై స్కూల్ నుంచి పదో తరగతి పరీక్షలో పాసయ్యారు. ఆ తర్వాత ఢిల్లీలోని సీఎస్‌కేఎం పబ్లిక్ స్కూల్ నుంచి 1998లో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు.నితిన్ నబిన్.. దీప్‌మాలా శ్రీవాస్తవను వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇదిలా ఉండగా.. నితిన్ నబిన్ రాజకీయ ప్రస్థానం 2006 ప్రారంభమైంది. పాట్నా వెస్ట్ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో గెలిచి.. రాజకీయాల్లోకి ప్రవేశించారు నితిన్. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత.. ఆయన బాంకిపూర్‌కు మారారు. అప్పటి నుంచి 2010, 2015, 2020, 2025 అసెంబ్లీ ఎన్నికల్లోనూ విజయం సాధిస్తూ.. తన కంచుకోటను కాపాడుకున్నారు.నితీష్ కుమార్ నేతృత్వంలోని బీహార్ ప్రభుత్వంలో కూడా నితిన్ నబిన్ కీలక పదవుల్లో పనిచేశారు. 2021 ఫిబ్రవరి నుంచి 2022 ఆగస్టు వరకు రహదారుల నిర్మాణ శాఖ మంత్రిగా పనిచేశారు. 2025 ఫిబ్రవరి నుంచి 2025 డిసెంబర్ వరకు తిరిగి అదే శాఖ బాధ్యతలను చేపట్టారు. ఇక 2024 మార్చి 2025 ఫిబ్రవరి మధ్య.. ఆయన పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ శాఖతో పాటు న్యాయ మంత్రిత్వ శాఖను కూడా నిర్వహించారు. ఆయన మంత్రిగా ఉన్న కాలంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పట్టణ గృహనిర్మాణ కార్యక్రమాలు, సంక్షేమ చర్యలపై దృష్టి సారించారు.బీజేపీ యువ విభాగం నుంచి వచ్చిన నబిన్.. సంస్థాగతంగా పార్టీ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. గతంలో నితిన్ బీజేపీ యువ మోర్చా (బీజేవైఎం) జాతీయ ప్రధాన కార్యదర్శిగా, బీజేవైఎం బీహార్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. ఇదే సమయంలో జమ్మూకాశ్మీర్‌లో జరిగిన జాతీయ ఐక్యతా యాత్ర, 1965 యుద్ధంలో వీరమరణం పొందిన అమరవీరులకు నివాళులర్పిస్తూ గౌహతి నుంచి తవాంగ్ వరకు నిర్వహించిన పాదయాత్ర సహా అనేక పార్టీ ప్రచార కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు.మరోవైపు, బీజేపీ సిక్కిం ఇంచార్జిగా, ఛత్తీస్‌గఢ్ కో–ఇంచార్జిగా నితిన్ నబిన్ పనిచేశారు. ఆయా రాష్ట్రాల్లో పార్టీ బలోపేతంలో కీలక పాత్ర పోషించారు. 2025 డిసెంబర్‌లో బీజేపీ పార్లమెంటరీ బోర్డు.. ఆయన్ను పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించింది.మొత్తానికి, నితిన్ నబిన్ నియామకంతో బీజేపీ ఒక కొత్త శకానికి నాంది పలికింది.

# గీతాంజలి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో ఘనంగా వైశేషిక సైన్స్ ఫెస్ట్



**కీసర, ఫిబ్రవరి 28, (తెలంగాణ దిశ):** గీతాంజలి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో నిర్వహించిన జాతీయ స్థాయి సైన్స్ ఫెస్ట్ 'వైశేషిక–2026' విద్యార్థుల నుండి విశేష స్పందన పొందింది. మేడ్చల్ జిల్లా కీసర మండలం చీర్యాల్ లోని కళాశాల ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి 1500 మందికి పైగా విద్యార్థులు హాజరై పరిశోధన మరియు ఆవిష్కరణలపై తమ ఆసక్తిని ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ డిఆర్ డిఓ రీసెర్చ్ సెంటర్ శాస్త్రవేత్త జి క్యాడర్ డాక్టర్ ఎ. రామచందర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు రూపొందించిన వివిధ సాంకేతిక ప్రాజెక్టులు, ఆవిష్కరణలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామచందర్ రావు మాట్లాడుతూ భవిష్యత్తులో దేశ అభివృద్ధికి యువత పరిశోధనలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. విద్యార్థులు చిన్న వయసులోనే ఇంతటి నైపుణ్యంతో ప్రాజెక్టులు రూపొందించడం అభినందనీయమని, డీఆర్ డిఓ వంటి సంస్థలలో ఇటువంటి ప్రతిభావంతులైన యువ శాస్త్రవేత్తల అవసరం ఉందని పేర్కొన్నారు. తమ ఆలోచనలను వాస్తవ రూపంలోకి తీసుకురావడానికి విద్యార్థులు ఎప్పుడూ సిద్ధంగా ఉండాలని సూచించారు. విద్యార్థుల పరిశోధన, ఇన్నోవేటివ్ ప్రోగ్రామ్స్ నిర్వహణలో మేనేజ్ ఈ సహకారం, ఫ్యాకల్టీ కృషిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల చైర్మన్ జిఆర్. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత, పరిశోధనా దృక్పథం పెంపొందించడమే లక్ష్యంగా ప్రతి సంవత్సరం వైశేషికను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇటువంటి సైంటిఫిక్ అండ్ టెక్నికల్ ఈవెంట్లలో విద్యార్థులు పాల్గొనేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని, వారిని ప్రోత్సహించడమే తమ లక్ష్యమని అన్నారు. వైస్ చైర్మన్ హరీష్ చంద్ర రెడ్డి మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో గీతాంజలి విద్యార్థులు ఎప్పుడూ ముందుంటారని ప్రశంసించారు. డైరెక్టర్ డాక్టర్ ఉదయ్ కుమార్ సుసర్ల మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచడమే కాకుండా, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా వారిని తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సాగర్ మాట్లాడుతూ ఈ సైన్స్ ఫెస్ట్ ద్వారా విద్యార్థులు తమ సృజనాత్మక ఆలోచనలను ప్రదర్శించే అవకాశం లభించిందని తెలిపారు. కన్వీనర్ డాక్టర్ జి. నీరజరాణి మాట్లాడుతూ ఈ ఏడాది వైశేషికలో 1500 మంది విద్యార్థులు పాల్గొనడం చాలా సంతోషకరమని అన్నారు. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలలో పాల్గొని తమ ప్రతిభను చాటాలని ఆకాంక్షించారు.

ఫ్రెష్ మెన్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ త్రివేణి మాట్లాడుతూ ఈ సైన్స్ ఫెస్ట్ లో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులు కూడా ఆసక్తిగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించడం విశేషమని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఫ్రెష్ మెన్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ త్రివేణి, కో ఆర్డినేటర్లుగా వ్యవహరించిన డాక్టర్ శంకర్, డాక్టర్ అంజయ్య, డాక్టర్ మధుసూదన్ రావు తదితరులు కీలక పాత్ర పోషించారు. వీరితో పాటు కళాశాలలోని వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది శ్రద్ధగా కృషి చేశారు. ఈ మేరకు విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను అధ్యాపకులు పరిశీలించి, వారికి మార్గదర్శకత్వం అందించారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల విద్యార్థులతో పాటు, గవర్నమెంట్ హైస్కూల్ యాద్గార్ పల్లి, చీర్యాల్, బండ్లగూడతో పాటు పినియన్, శ్రీ వేద, డివైన్ గ్రేస్ ప్రైవేట్ హైస్కూల్ నుండి వచ్చిన విద్యార్థులు కూడా ఆసక్తిగా పాల్గొని తమ ప్రాజెక్టులను ప్రదర్శించడమే కాకుండా, పోటీల్లో పాల్గొని బహుమతులు గెలుచుకున్నారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేశారు. మొత్తంగా వైశేషిక 2026 విద్యార్థులలో సైన్స్ పైన మక్కువను మరింత పెంచడంతో పాటు, పరిశోధనాత్మక ఆలోచనలకు ఒక గొప్ప వేదికగా నిలిచింది.



# కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి వెంటనే రాజీనామా చేయాలి

## గాంధీ భవన్ ప్రాంగణంలో నిరసన, దిష్టిబొమ్మ దగ్ధం

## మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు



**హైదరాబాద్, ఫిబ్రవరి 28, (తెలంగాణ దిశ) :** మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని గాంధీభవన్ లో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది అనంతరం గాంధీభవన్ ప్రాంగణంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతా రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గాంధీభవన్‌లో హర్దీప్ సింగ్ పూరి రాజీనామా కోరుతూ సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. అనంతరం నాంపల్లి మెయిన్ రోడ్డుపై మంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సునీతారావు మాట్లాడుతూ ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మహిళా కాంగ్రెస్ బృందం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం సమర్థవంతంగా పనిచేసిందని, అందుకు అందరినీ అభినందించారు. రాబోయే ఎంపీటీసీ, జడ్ పీటీసీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కలిసికట్టుగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. కేంద్ర పెట్రోలియం, సహజ వాయు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరిపై తీవ్ర ఆరోపణలు చేసారు. జెఫ్రీ ఎప్‌స్టీన్ వ్యవహారంలో వచ్చిన అంశాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫైళ్లలో ప్రస్తావనలు ఉన్నాయనే ఆరోపణల నేపథ్యంలో మంత్రి హర్దీప్ సింగ్ పూరి వెంటనే రాజీనామా చేయాలని కోరారు.



చిన్నారులపై జరిగిన లైంగిక, శారీరక, మానసిక వేధింపులకు న్యాయం చేయాలని మహిళా కాంగ్రెస్ తరఫున డిమాండ్ చేశారు. యువజన కాంగ్రెస్ నాయకులపై అరెస్టులు చేసి వేధింపులకు గురి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. వారిని తక్షణమే విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

**రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు**

నేటి నుంచి జిల్లాల వారీగా సంతకాల సేకరణ కార్యక్రమాలు




చేపట్టనున్నట్లు తెలిపారు. మార్చి 1 నుంచి 4 వరకు జిల్లా కమిటీ సభ్యులతో వైట్ టీ–షర్టు ధరించి ప్రెస్ మీట్లు



నిర్వహించాలని పిలుపు నిచ్చారు. మార్చి 5 నుంచి 7 వరకు నల్ల దుస్తులు ధరించి పాదయాత్రలు నిర్వహించి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించాలని సూచించారు. మార్చి 8న క్యాండిల్ ర్యాలీ నిర్వహించి బాలికలకు న్యాయం చేయాలని కోరుతూ బ్యానర్లతో ర్యాలీ చేపట్టాలని తెలిపారు. మార్చి 9, 10 తేదీలలో ఢిల్లీలో నేషనల్ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో పార్లమెంట్ దిగ్బంధనానికి పిలుపు నిచ్చినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాల మహిళా కాంగ్రెస్ కమిటీ సభ్యులు, మహిళా సోదరీమణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య సీబీఎస్ ఈ స్కూల్ లో ఘనంగా నేషనల్ సైన్స్ డే వేడుకలు






**ఏఎస్ రావునగర్, ఫిబ్రవరి 28, (తెలంగాణ దిశ) :** జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏఎస్ రావునగర్ డివిజన్ టిఎస్ఐఐసి కాలనీలోని శ్రీ చైతన్య సీబీఎస్ఈ స్కూల్ లో శనివారం నేషనల్ సైన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస ప్రభు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైజ్ఞానిక దినోత్సవ వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథంను వెలికి తీయడానికి ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు రూపొందించిన వివిధ సైన్స్ ప్రాజెక్టులు, మోడల్స్, ఆవిష్కరణలు, పర్యావరణ, శక్తి వనరుల సంరక్షణ అంతరిక్ష రంగాల ఆవిష్కరణలతో విద్యార్థులు స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఎవరికి వారు రూపొందించిన మోడల్స్ ను సందర్శిలకు విద్యార్థులు వివరించిన విధానం అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంధ్యారాణి, సత్యవాణి, ప్రపూర్ణ, వసంత, జ్యోతి, అనుప్రిత, కిరణ్, మహాదేవి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# షైనీ స్కాలర్ స్కూల్‌లో ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శన







**మెహిదీపట్నం, ఫిబ్రవరి 28, (తెలంగాణ దిశ):** మెహిదీపట్నంలోని షైనీ స్కాలర్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శన (సైన్స్ ఎగ్జిబిషన్)లో విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో విద్యార్థులు విభిన్న శాస్త్రీయ అంశాలపై రూపొందించిన ప్రాజెక్టులు సందర్శకులను ఆలోచింపజేశాయి. ప్రదర్శనలో భాగంగా పర్యావరణ పరిరక్షణ, సౌరశక్తి వినియోగం, జల సంరక్షణ, రోబోటిక్స్, స్మార్ట్ సిటీ నమూనాలు, వాతావరణ మార్పులు వంటి ఆధునిక అంశాలపై విద్యార్థులు రూపొందించిన నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కొంతమంది విద్యార్థులు స్వయంగా తయారు చేసిన వర్కింగ్ మోడల్స్ ద్వారా శాస్త్రీయ సూత్రాలను ప్రత్యక్షంగా చూపిస్తూ సందర్శకులకు వివరణ ఇచ్చారు. కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ షాహియా సుల్తాన, డైరెక్టర్ ముష్తాక్ అహ్మద్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఇటువంటి విజ్ఞాన ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. పుస్తక జ్ఞానంతో పాటు ప్రాయోగిక అవగాహన కూడా అవసరమని అన్నారు.


భవిష్యత్ శాస్త్రవేత్తలుగా ఎదగాలంటే చిన్న వయసు నుంచే పరిశోధనా దృక్పథం అలవర్చుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారి కృషిని ప్రశంసించారు. తల్లిదండ్రులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై పిల్లల ప్రతిభను చూసి ఆనందం వ్యక్తం చేశారు. ప్రదర్శనలో ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ విజ్ఞాన ప్రదర్శన విద్యార్థుల్లో శాస్త్రంపై ఆసక్తిని పెంపొందించడమే కాకుండా, సృజనాత్మక ఆలోచనలకు వేదికగా నిలిచిందని పలువురు ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీ గౌరీ శ్రీ, అస్మా, అనిత, సరస్వతీ శర్మ, సుధాకర్, మెరుగు విజయమోహన్, మహేష్, రవీందర్, ప్రశాంతి, రూహి తదితరులు పాల్గొన్నారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు వన్ శిత్, హనోక్, వైభవి, వసుంధర, ఉజ్వల్, హితీష్, దీక్షిత, లక్ష్మీకాంతం, సుశాంత్, అమేనా, కౌసర్, సిద్రా, ఇషాక్, గౌరవ్, భూమిక, దివ్య, జనాబ్, లక్షశ్రీ, అనియా, శివాని, ఇనాయా, శఫియా, రుష్దా, అల్మిరా, అరుణ్, పల్లవి, సాత్విక, హాసిని, హాఫ్సా ఫాతిమా, చంద్రిక, అలీనా, జునైత్, అలీషా ఆనమ్, సిద్దార్థ్, రుత్విక్, సానియా తదితరులు ప్రదర్శించిన నమూనాలు ఆకట్టుకున్నాయి.

## మేడికుంట చెరువుకు ఫెన్సింగ్ వేసిన

# బాచుపల్లి రెవెన్యూ, హైడ్రా






**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 28, (తెలంగాణ దిశ):** నిజాంపేట సర్కిల్ బాచుపల్లి గ్రామ పరిధిలోని మేడికుంట చెరువుకు శనివారం హైడ్రా, బాచుపల్లి రెవెన్యూ అధికారులు ఫెన్సింగ్ వేయడం ప్రారంభించారు. బాచుపల్లి గ్రామం మేడికుంట సర్వే నెంబర్ 256 లో సుమారు 40 ఎకరాల మేడికుంట చెరువు క్రమేపి కబ్జాల పాలవుతుండడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు బాచుపల్లి రెవెన్యూ అధికారులు, హైడ్రాధికారులు ఫెన్సింగ్ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ విషయమై హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు చెరువు పరిరక్షణకు అధికారులు నడుం బిగించారు. శనివారం ఉదయం నుండే స్థానిక పోలీసుల సహకారంతో రెవెన్యూ అధికారులు, హైడ్రా అధికారులు అయిన హైడ్రా సీఐ నరేష్, బాచుపల్లి రెవెన్యూ ఇన్స్పెక్టర్లు భాను, మల్లికార్జున్ లు, వారి సిబ్బంది, హైడ్రా సిబ్బంది భారీ సంఖ్యలో చెరువు వద్దకు చేరుకొని కబ్జాలు కావడానికి అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తిస్తూ ఫెన్సింగ్ పనులను మొదలుపెట్టారు. అయితే చెరువు విస్తీర్ణం ఎక్కువగా ఉండడంతో శనివారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం వరకు పనులు నిర్వహించి నా ఫెన్సింగ్ పనులు పూర్తి కాకపోవడంతో ఆదివారం కూడా పనులు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా బాచుపల్లి రెవెన్యూ ఇన్ స్పెక్టర్ భాను మాట్లాడుతూ చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాలను ఎవరైనా కబ్జాలకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. ఫెన్సింగ్ పనులలో గ్రామ పాలన అధికారులు పవిత్ర ,అనురాధ లు పాలుపంచుకున్నారు. మేడికుంట చెరువు బాచుపల్లి-నిజాంపేట్ ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉండడంతో కబ్జాదారుల కళ్ళు దీనిపై పడ్డాయి. ఇప్పటికే కొంత స్థలం కబ్జాల పాలవగా స్థానికుల ఫిర్యాదు మేరకు చెరువు పరిరక్షణకు హైడ్రా, బాచుపల్లి రెవెన్యూ అధికారులు పరిస్థితి తీవ్రత దృష్ట్యా చెరువును కాపాడే పనిలో భాగంగా ఫెన్సింగ్ కార్యక్రమాని మొదలుపెట్టారు.

## 6.5 కోట్లతో అంతర్జాతీయ స్థాయి అథ్లెటిక్ ట్రాక్

**కరీంనగర్,తెలంగాణ దిశ :**ఉత్తర తెలంగాణ క్రీడాకారుల చిరకాల స్వప్నం నెరవేరను ంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చొరవతో జమ్మికుంటలో రూ. 6.5 కోట్లతో అత్యాధునిక సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ ఏర్పాటుకు కేంద్రం అనుమతులు మంజూరు చేసింది. 'ఖేలో ఇండియా' పథకం కింద నిర్మించనున్న ఈ ట్రాక్, గ్రామీణ క్రీడాకారుల కు ప్రపంచ స్థాయి శిక్షణ అవకాశాలను అందించి, ఉత్తర తెలంగాణను క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దనుందిఉత్తర తెలంగాణలోని క్రీడాకారుల చిరకాల స్వప్నం నెరవేరబోతోంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రత్యేక చొరవ, కేంద్ర ప్రభుత్వ సానుకూల నిర్ణయంతో కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో అత్యాధునిక సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయి ఛాంపియన్లుగా తీర్చిదిద్దాలనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పంలో భాగంగా.. 'ఖేలో ఇండియా' పథకం కింద ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం పరిపా లనా పరమైన అనుమతులు మంజూరు చేసింది.

ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కోసం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ రూ. 6.5 కోట్లు కేటాయిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈ అధునాతన ట్రాక్‌ను నిర్మించనున్నారు. వరల్డ్ అథ్లెటిక్స్ నిర్దేశించిన అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా 400 మీటర్ల పొడవు, 4 లైన్లతో ఈ సింథటిక్ ట్రాక్ రూపుదిద్దుకోనుంది. సాధారణంగా మట్టి ట్రాక్‌లపై శిక్షణ పొందే గ్రామీణ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు వెళ్లినప్పుడు అక్కడి సింథటిక్ ట్రాక్‌ల స్వభావాన్ని అర్థం చేసుకోలేక ఇబ్బంది పడుతుంటారు. ఇప్పుడు జమ్మికుంటలోనే ఇటువంటి సౌకర్యం అందుబాటులోకి రావడం వల్ల, క్రీడాకారులు తమ సొంత ప్రాంతంలోనే ప్రపంచ స్థాయి ప్రమాణాలతో శిక్షణ పొందే అవకాశం లభిస్తుంది. ఈ ప్రాజెక్టు కేవలం జమ్మికుంటకే పరిమితం కాకుండా కరీంనగర్, హన్మకొండ, జగిత్యాల మరియు పెద్దపల్లి జిల్లాల సరిహద్దుల్లోని వేలాది మంది క్రీడాకారులకు వరం కానుంది. సింథటిక్ ట్రాక్‌తో పాటు లాంగ్ జంప్, హై జంప్ వంటి ఇతర అథ్లెటిక్స్ క్రీడలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కూడా ఇక్కడ అభివృద్ధి చేసే అవకాశం ఉంది.

# సాయి రాంనగర్‌లో వివేకానంద మోడల్ హైస్కూల్ సైన్స్ ఫేర్ విజయవంతం





**కాప్రా, ఫిబ్రవరి 28, (తెలంగాణ దిశ) :**కాప్రా సాయిరాంనగర్ లోని వివేకానంద మోడల్ హైస్కూల్ లో 2026 ఫిబ్రవరి 28న సైన్స్ ఫేర్ (విజ్ఞాన ప్రదర్శన)ను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల ప్రతిభకు వేదికగా నిలిచింది. సైన్స్ ఫేర్‌ను నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానంపై విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించేందుకు ఇటువంటి ప్రదర్శనలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. పుస్తక జ్ఞానంతో పాటు ప్రాయోగిక అవగాహన కూడా సమానంగా ముఖ్యమని సూచించారు. ప్రదర్శనలో విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ, సౌరశక్తి వినియోగం, జల సంరక్షణ, స్మార్ట్ సిటీస్ నమూనాలు, రోబోటిక్స్ తదితర అంశాలపై రూపొందించిన ప్రాజెక్టులు సందర్శకులను ఆకట్టుకున్నాయి. వర్కింగ్ మోడల్స్ ద్వారా శాస్త్రీయ సూత్రాలను సులభంగా వివరిస్తూ విద్యార్థులు తమ సృజనాత్మకతను చాటుకున్నారు. ఈ వేడుకకు తల్లిదండ్రులు, స్థానిక నివాసితులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరై విద్యార్థుల కృషిని అభినందించారు. ఉపాధ్యాయులు అందించిన మార్గనిర్దేశం, పాఠశాల యాజమాన్యం అందించిన ప్రోత్సాహం వల్లే ఈ విజ్ఞాన ప్రదర్శన విజయవంతమైందని పేర్కొన్నారు. విద్యార్థుల్లో అన్వేషణాత్మక దృక్పథాన్ని పెంపొందిస్తూ, భవిష్యత్ శాస్త్రవేత్తలకు పునాది వేస్తూ ఈ సైన్స్ ఫేర్ గర్వకారణమైన ఘట్టంగా నిలిచిందని పాఠశాల వర్గాలు తెలిపారు.



## లక్ష దాటిన పెట్రోల్ పంపులు



న్యూఢిల్లీ, : దేశవ్యాప్తంగా పెట్రోల్ బంకులు లక్ష దాటిపోయాయి. ప్రభుత్వరంగ సంస్థలు అత్యధికంగా పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయడానికి మొగ్గుచూపడంతో ఈ ఏడాది ఇప్పటి వరకు దేశీయంగా 1,00,266 పెట్రోల్ బంకులు అందుబాటులోకి వచ్చాయి. వీటిలో 90 శాతం ప్రభుత్వరంగ సంస్థలైన ఐవోసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నడుస్తున్న బంకులు ఉండటం విశేషం. అలాగే ప్రపంచ దేశాల్లో మూడో అతిపెద్ద దేశంగా భారత్ నిలిచినట్లు పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలసిస్ సెల్ తాజాగా వెల్లడించింది. తొలి స్థానంలో అమెరికా ఉండగా, ఆ తర్వాత స్థానంలో చైనా నిలిచింది. వీటితోపాటు ప్రైవేట్ సంస్థలైన నయారా, రిలయన్స్-బీపీ, షెల్‌లు సంయుక్తంగా 10 వేల వరకు నిర్వహిస్తున్నాయి. 2015లో దేశవ్యాప్తంగా 50 వేల స్థాయిలో ఉన్న పెట్రోల్ బంక్‌లు కేవలం పదేండ్లలో రెండింతలు పెరుగడం విశేషం. దేశవ్యాప్తంగా 41,664 బంక్‌లతో తొలిస్థానంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్. బీపీసీఎల్ 24,605 స్టేషన్లు ఉండగా, హెచ్‌పీసీఎల్‌కి 24,418 పెట్రోల్ బంకులు ఉన్నాయి. ఈ బంకుల్లోనే సీఎన్‌జీ, ఈవీ చార్జింగ్ స్టేషన్లను కూడా నెలకొల్పుతున్నారు. అలాగే నయారా ఎనర్జీకి 6,921 బంకులు, రిలయన్స్-బీపీకి సంయుక్తంగా 2,114, షెల్‌కు 346 పెట్రోల్ బంకులను నిర్వహిస్తున్నాయి.

## మందుబాబులకు అడ్డాగా గవర్నమెంట్ స్కూల్...!



**నర్వ,తెలంగాణ దిశ :** మండల పరిధిలోని కల్వల గ్రామంలో వైన్స్ ఉండడం వల్ల సిపూర్ కల్వాల్ గ్రామం మధ్యలో ఉన్న హై స్కూల్ దగ్గర పట్టణాల నుంచి వచ్చిన మద్యం ప్రియులు, గ్రామంలో ఉన్న మందుబాబులు పండుగలు వచ్చినప్పుడల్లా సిట్టింగ్ వేయడం జరుగుతుందని గ్రామ ప్రజలు తెలియజేస్తున్నారు. క్లాస్ రూములను తమ అడ్డాగా మార్చుకున్నారు. వరుసగా క్రిస్మస్ మరియు ఇతర సెలవులు రాగా మందుబాబులకు అడ్డాగా ప్రభుత్వ స్కూల్ మారింది. రాత్రి సమయంలో సిట్టింగులు వేయడం జరుగుతుంది. తాగిన బాటిల్స్ మరియు స్నాక్స్ చెత్తను క్లాస్ రూమ్ లో అక్కడే వదిలి వేయడం జరుగుతుంది. సంబంధిత అధికారులు దీనిపై వెంటనే స్పందించి మందుబాబులపై చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు ఆవేదనను వ్యక్తపరుస్తున్నారు. ఇటువంటి చెడు పనులు చేయడం వల్ల విద్య బుద్ధులు నేర్చుకున్నటువంటి స్కూల్ లో మద్యం తాగడం అత్యంత దుర్భరం అని గ్రామ ప్రజలు రావేదనని వ్యక్తపరుస్తున్నారు. ప్రభుత్వ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఇట్టి విషయాన్ని పట్టించుకోవడం లేదని గ్రామ ప్రజలు తెలియపరుస్తున్నారు. మద్యం షాపును ఇక్కడి నుండి మారుస్తామన్న అధికారులు కూడా ఇప్పటివరకు టెండర్ దారులకు తెలియ పరచడం లేదని అంటున్నారు. మొండి వైఖరిని వీడి వైన్స్ ను ఇక్కడి నుంచి తరలించి గ్రామాలకు దూరంగా పెట్టాలని గ్రామ ప్రజలు తెలియజేస్తున్నారు. ఈ విషయం పై అధికారులు ఒకసారి స్పందించి సరైన నిర్ణయం తీసుకుంటారని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఏపీలో 70 అన్న క్యాంటీన్లు



**విజయవాడ,తెలంగాణ దిశ :**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంక్రాంతి పండుగ సందర్భం గా గ్రామీణ ప్రజలకు శుభవార్త అందించింది. నియోజకవర్గ, మండల కేంద్రాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు కాబోతున్నాయి. మొత్తం 70 అన్న క్యాంటీన్లను ఒకేసారి ప్రారంభించడానికి కసరత్తు చేస్తున్నారు. జనవరి 10లోగా నిర్మాణ పనులు పూర్తి చేసి.. జనవరి 13 నుంచి 15 మధ్య ఈ క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకురావా లని భావిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నగరాలు, పట్టణ ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లు విజయవంతం అయ్యాయి.. ప్రజల నుంచి ఆదరణ వస్తోంది. అందుకే గ్రామీణ ప్రాంతాల్లోనూ అన్న క్యాంటీన్లను విస్తరిం చాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.గ్రామీణ ప్రాంతాల్లోనూ అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేలు చేసిన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కొత్తగా మొత్తం 70 క్యాంటీన్లను మంజూరు చేసింది. ప్రస్తుతం పట్టణాల్లో 205 అన్న క్యాంటీన్లు నడుస్తున్నాయి.. వీటిలో రోజుకు మూడు పూటలా కలిపి 2 లక్షల మందికి పైగా ప్రజలు తక్కువ ధరకే భోజనం చేస్తున్నారు. ఉదయం, రాత్రి టిఫిన్, మధ్యాహ్నం భోజనం అందిస్తున్నారు. ఒక్కో పూటకు కేవలం రూ. 5కే రుచికరమైన ఫుడ్ అందిస్తున్నారు. ఈ పథకం గ్రామీ ణ ప్రజలకు కూడా ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నా రు. ఆంధ్రప్రదేశ్‌లో నగరాలు, పట్టణాల్లో ఏర్పాటు చేసిన 205అన్న క్యాంటీన్ల ద్వారాపేదల ఆకలి తీరుస్తున్నారు. ఇప్పటివరకు 7.20 కోట్ల మందికి పైగా ప్రజలు ఈక్యాంటీన్లలో భోజనంచేశారు. ఇందులో మధ్యాహ్న భోజనం చేసిన వారి సంఖ్య 3.16 కోట్లు. ఉదయం అల్పాహారం 2.62 కోట్ల మంది, రాత్రి భోజనం 1.42 కోట్ల మంది తీసుకున్నారు. ఈ క్యాంటీన్లలో విశాఖపట్నం, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల నుండి అత్యధిక సంఖ్యలో పేదలు వస్తున్నారని అధికారులు తెలిపారు. ఈ జిల్లాల్లోని క్యాంటీన్లలో రద్దీ ఎక్కువగా ఉంటోంది. పేదల ఆకలి తీర్చడమే ఈ క్యాంటీన్ల ముఖ్య ఉద్దేశ్యం. తక్కువ ధరకే నాణ్యమైన ఆహారాన్ని అందించడం ద్వారా ఎంతో మందికి అండగా నిలుస్తున్నాయి. ఇప్పుడు గ్రామాల్లో కూడా అన్న క్యాంటీన్లను ప్రారంభించనున్నారు.జిల్లాల వారీగా చూస్తే.. చిత్తూరు 7, గుంటూరు 5, శ్రీకాకుళం జిల్లా 5, తూర్పుగోదావరి 4, ఏలూరు 4, ప్రకాశం 4, కర్నూలు 4, విజయనగరం 3, అనంతపు?రం 3, అల్లూరి సీతా రామరాజు 3, అనకాపల్లి 3, బీఆర్ అంబేద్కర్ కోనసీమ 3, పశ్చిమ గోదావరి 3,కృష్ణా 3, నెల్లూరు 3,అన్నమయ్య 3,కాకినాడ 2, తిరుపతి 2, పార్వతీపురం మన్యం 1, పల్నాడు 1, ఎన్టీఆర్ 1, శ్రీసత్యసాయి 1, నంద్యాల 1, కడప 1 క్యాంటీన్లను ఏర్పాటు చేయనున్నారు

# పీవీ సునీల్ కుమార్ పై వేటు..




**గుంటూరు,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయ క్షేత్రంలో ప్రస్తుతం అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ మధ్య పెద్ద యుద్ధమే నడుస్తోంది. ఈ పోరు కేవలం ఇద్దరు వ్యక్తుల మధ్య గొడవగా కాకుండా.. చట్టం, సర్వీస్ నిబంధనలు, రాజకీయ వ్యవస్థల మధ్య ఘర్షణగా మారుతోంది. గత కొన్నాళ్లుగా వీరి మధ్య కొనసాగుతున్న మాటల యుద్ధం, సీబీఐ ఎఫ్ఐఆర్ నేపథ్యంలో తారాస్థాయికి చేరింది.బ్యాంకుల కన్సార్టియంను మోసం చేశారనే ఆరోపణలపై రఘురామ కృష్ణరాజుపై సీబీఐ తాజాగా కేసు నమోదు చేయడం ఈ వివాదాన్ని మలుపు తిప్పింది. దీనిని అస్త్రంగా చేసుకున్న పీవీ సునీల్ కుమార్, సోషల్ మీడియా వేదికగా తీవ్ర విమర్శలకు దిగారు. ఒక రాజ్యాంగబద్ధమైన డిప్యూటీ స్పీకర్ పదవిలో ఉన్న వ్యక్తిపై ఆర్థిక నేరారోపణలు రావడం నైతికంగా తప్పని, ఆయన తక్షణమే పదవి నుంచి తప్పుకోవాలని సునీల్ కుమార్ డిమాండ్ చేశారు. ఒక అడుగు ముందుకు వేసి, రఘురామకు యావజ్జీవ శిక్ష తప్పదని, అవసరమైతే తాను కూడా ఆ కేసులో ఇంప్లీడ్ అవుతానని వీడియో సందేశం విడుదల చేయడం సంచలనం రేకెత్తించింది.ఈ వివాదంలో ప్రధానంగా వినిపిస్తున్న ప్రశ్న.. "సస్పెన్షన్‌లో ఉన్న ఒక ఐపీఎస్ అధికారి రాజకీయ విమర్శలు చేయవచ్చా?" అనేది. 1968 ప్రకారం, సర్వీసులో ఉన్న అధికారి సస్పెన్షన్‌లో ఉన్నా సరే ప్రభుత్వంపై గానీ, రాజకీయ నేతలపై గానీ బహిరంగంగా విమర్శలు చేయకూడదు. నియమం 7 ప్రకారం ఏ అధికారి కూడా ప్రభుత్వం లేదా వ్యవస్థల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ప్రకటనలు చేయకూడదు. సివిల్ సర్వెంట్స్ రాజకీయాలకు అతీతంగా ఉండాలి. కానీ, సునీల్ కుమార్ నేరుగా డిప్యూటీ స్పీకర్‌ను ఉద్దేశించి జైలుకు వెళ్లడం ఖాయం, యావజ్జీవ కారాగార శిక్ష పడుతుంది.. అని వ్యాఖ్యానించడం సర్వీస్ రూల్స్‌ను ఉల్లంఘించడమేనని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.తనపై వ్యక్తిగత దాడికి దిగడమే కాకుండా, న్యాయస్థానంలో ఉన్న కేసులను ప్రభావితం చేసేలా సునీల్ కుమార్ మాట్లాడుతున్నారని రఘురామ కృష్ణరాజు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాకు ఫిర్యాదు చేశారు. సునీల్ కుమార్‌ను కేవలం సస్పెన్షన్‌తో వదిలేయకుండా, సర్వీస్ నుంచి పూర్తిగా డిస్మిస్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఒక ఐపీఎస్ అధికారి ఇలా వీధి రౌడీలా మాట్లాడటం వ్యవస్థలకే ప్రమాదకరమని ఆ లేఖలో పేర్కొన్నారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకునే అవకాశం కనిపిస్తోంది. సాధారణంగా ఇలాంటి ఫిర్యాదులు వచ్చినప్పుడు ప్రభుత్వం కొన్ని రూల్స్ ఫాలో అవుతుంది. మొదట నిబంధనల ఉల్లంఘనపై షోకాజ్ నోటీస్ ఇచ్చి వివరణ కోరుతుంది. ఇప్పటికే సస్పెన్షన్‌లో ఉన్న సునీల్ కుమార్‌పై కొత్త అభియోగాలతో సస్పెన్షన్ కాలాన్ని పొడిగించే అవకాశం ఉంటుంది. ఐపీఎస్ అధికారులు కేంద్ర హోంశాఖ పరిధిలోకి వస్తారు కాబట్టి, విచారణ నివేదికను ఢిల్లీకి పంపడం. ఒకవేళ నేరం రుజువైతే ఆయన సర్వీస్ నుంచి తొలగించబడే ప్రమాదం ఉంది.రఘురామ కృష్ణరాజుపై ఉన్న సీబీఐ కేసు చట్టపరంగా నడుస్తుంది. రాజకీయ విమర్శలు చేయడం ఖచ్చితంగా చర్చనీయాంశమే. ఈ పరిణామాలు పీవీ సునీల్ కుమార్ కెరీర్‌ను ఇబ్బందుల్లోకి నెట్టేలా కనిపిస్తున్నాయి.

# రంగా నాడుకు సిద్ధం..

విశాఖపట్టణం: సుమారు నాలుగు దశాబ్దాల క్రితం కాపు సమాజంలో రాజకీయ చైతన్యానికి నాంది పలికిన ఒక చారిత్రక ఘట్టం జరిగింది. కాపునాడు పేరుతో తొలి భారీ సభను వంగవీటి మోహన రంగారావు నిర్వహించారు. ఆ సమయంలో ఆయన విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే గా ఉన్నారు. కాపు సామాజిక వర్గానికి రాజకీయంగా గుర్తింపు, గౌరవం కావాలన్న ఆకాంక్షకు ఆ సభ ప్రతీకగా నిలిచింది. ఆ ఒక్క సభతోనే రంగా పేరు రాష్ట్ర రాజకీయాల్లో మార్మోగింది. విజయవాడ పరిధిలోనే పరిమితమయ్యే నేతగా కాకుండా, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కీలక కేంద్రంగా ఆయన ఎదిగారు. రంగా రాజకీయ ప్రస్థానం సామాజిక ఉద్యమాలతో ముడిపడి సాగింది. పేదలు, బడుగు వర్గాల కోసం ఆయన చేసిన పోరాటాలు ప్రజల్లో ఆయనకు ప్రత్యేక స్థానం తెచ్చిపెట్టాయి. అయితే 1988న విజయవాడలోనే ఆయన హత్యకు గురికావడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర సంచలనంగా మారింది. ఆ తర్వాత కూడా కాపునాడు వేదికపై అనేక మంది నాయకులు ముందుకు వచ్చి, సమాజంలో చైతన్యం కొనసాగించే ప్రయత్నాలు చేశారు.ఇప్పుడు అదే స్ఫూర్తితో విశాఖపట్నం వేదికగా 'రంగా నాడు' పేరిట ఒక భారీ సభ నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. రంగా వర్ధంతి సందర్భంగా జరిగే ఈ కార్యక్రమాన్ని ఆయన అభిమానులు, అనుచరులు కలిసి నిర్వహిస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రముఖులను ఆహ్వానిస్తూ, విశాఖ బీచ్‌వద్ద లక్ష మందికిపైగా ప్రజలతో సభ నిర్వహించాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నారు. ఈ ప్రకటనతోనే విశాఖ జిల్లా తో పాటు కోస్తా ప్రాంతం అంతటా ఆసక్తి నెలకొంది.ఈ సభలో ఏ అంశాలు ప్రస్తావిస్తారు, ఎలాంటి తీర్మానాలు తీసుకుంటారు అన్నదానిపై ఇప్పటికే చర్చలు మొదలయ్యాయి. రంగా తన జీవితమంతా సామాజిక న్యాయం కోసం అంకితం చేశారని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని అభిమానులు చెబుతున్నారు. ప్రతి సంవత్సరం జూలై 4న ఆయన జయంతి రోజున విగ్రహా విష్కరణలు, నివాళి కార్యక్రమాలు నిర్వహించడం సంప్రదాయంగా మారింది. కానీ ఈసారి విశాఖలో లక్షలాది మందితో సభ నిర్వహించాలనే ఆలోచన రాజకీయంగా, సామాజికంగా కూడా ఉత్కంఠను పెంచుతోంది.సాగర ఘోషలా సాగే ఈ రంగా నాడు సభ ఎటువంటి రాజకీయ ప్రకంపనలకు దారితీస్తుందా అన్న ప్రశ్న కూడా వినిపిస్తోంది. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్‌లో కాపులు అతి పెద్ద సామాజిక వర్గంగా ఉన్నారు. రాజ్యాధికారం తమకు దక్కాలన్న కోరిక దశాబ్దాలుగా నెరవేరకపోవడం వల్ల కొంత అసంతృప్తి ఉంది. అదే సమయంలో రంగా వంటి నేతల ఆశయాలను యువతకు చేరవేయాలన్న బాధ్యత కూడా ఉందనే భావన కనిపిస్తోంది. మరి విశాఖ వేదికగా జరిగే ఈ సభ ఎలాంటి సందేశాన్ని ఇస్తుందో, ఏ దిశగా చర్చను మళ్లిస్తుందో అన్నది చూడాల్సిందే. అయితే ప్రస్తుతం మాత్రం రంగా నాడుపై అందరి చూపూ కేంద్రీకృతమై ఉందన్నది వాస్తవం.


# భారీగా పెరిగిన కోడిగ్రుడ్డు ధర

**విజయవాడ,,తెలంగాణ దిశ :**నాన్‌వెజ్ ప్రియులకు ఇది బ్యాడ్‌న్యూస్ అనే చెప్పవచ్చు. ఇప్పటికే కోడి గుడ్ల ధరలు పెరుగుతోండగా.. దానితో పాటు చికెన్ ధరలు కూడా భగ్గుమంటున్నాయి. త్వరలో క్రిస్మస్, న్యూఇయర్, సంక్రాంతి లాంటి ప్రధాన పండుగలు వస్తుండటంతో వివిధ ప్రాంతాలకు కోళ్ల సరఫరా పెరిగిపోయింది. దీంతో డిమాండ్ కారణంగా చికెన్ ధరలు పెరిగిపోతున్నాయి. దాణా ఖర్చులు పెరుగడంతో కోళ్ల ఫామ్స్ నిర్వహణ కూడా యజమానులకు కష్టంగా మారిపోయింది. దీంతో ధరల పెరుగుదలకు ఇది కూడా ఒక కారణంగా చెబుతున్నారు. గుడ్లు, చికెన్ ధరలు పెరగడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజల ఇంటి ఖర్చు పెరుగుతోంది. దీంతో పండుగ వేళ సామాన్యులకు భారం తప్పడం లేదు. మరికొన్ని రోజుల పాటు ధరలు ఇలాగే కొనసాగే అవకాశముందని తెలుస్తోంది.నెల క్రిందట గుడ్డు ధర రూ.5 ఉండగా.. ఇప్పుడు ఏకంగా రూ.3 పెరిగి రూ.8కి చేరుకుంది. హోల్‌సెల్ మార్కెట్లో రూ.7.50గా ఉండగా.. రిటైలర్లు రూ.8కి విక్రయిస్తున్నారు. ఇక నాటుకోడి గుడ్డు ధర రూ.15 పలుకుతోంది. ఇక వీటితో పాటు చికెన్ ధరలు కూడా అమాంతం పెరిగాయి. నెలలోనే రూ.100 మేర కేజీ చికెన్ ధర పెరిగింది. నెల క్రితం రూ.190 నుంచి రూ.200 మధ్య కేజీ చికెన్ ధర కొనసాగింది. ఈ నెల ప్రారంభంలో రూ.230 వరకు చేరుకోగా..



ఆదివారం నాటికి రూ.290కి చేరుకుంది. దీంతో నెల రోజుల్లో రూ.100 మేర చికెన్ ధర పెరిగినట్లయింది. పండుగల సీజన్ కావడంతో చికెన్‌కు ఫుల్ డిమాండ్ పెరగడం, డిమాండ్‌కు తగ్గట్లు కోళ్ల ఫామ్స్ నుంచి కోళ్లు రాకపోవడంతో ధరలు పెంచుతున్నారు.ఇక కోళ్లకు వేసే దాణా ఖర్చులు కూడా భారీగా పెరిగాయి. అలాగే ఇతర ఖర్చులు కూడా పెరగడంతో చికెన్ ధరలు పెంచాల్సి వస్తోందని యజమానులు చెబుతున్నారు. అసలే త్వరలో పండుగల సీజన్ వస్తుండటంతో చికెన్ ఎక్కువగా తింటూ ఉంటారు. ఈ సమయంలో రేట్లు పెరగడం సామాన్యులకు భారం కానుందని చెప్పవచ్చు. మరో నెల రోజుల పాటు పరిస్థితి ఇలాగే ఉంటుందని, ఆ తర్వాత ధరలు తగ్గే అవకాశం ఉంటుందని పౌల్ట్రీ ఎక్స్‌పర్ట్ చెబుతున్నారు.ప్రస్తుతం ఒక్క కోడిగుడ్డు రికార్డు స్థాయిలో రూ. 8కి చేరింది. ఇక హోల్‌సేల్ మార్కెట్లోనే ఒక్కో గుడ్డు ధర రూ.7.30 పలుకుతుండటం విశేషం. గతంలో ఒక ట్రే (30 గుడ్లు) రూ.160 నుంచి రూ.170 వరకు లభించేవి. కానీ, ప్రస్తుతం అది రూ.210 నుంచి రూ. 220కి చేరింది. కోడిగుడ్డు ధరలు ఈ స్థాయికి చేరుకోవడం పౌల్ట్రీ ఇండస్ట్రీ చరిత్రలోనే తొలిసారి అని చెబుతున్నారు. అయితే, ధరలు ఇంతలా పెరగడానికి ప్రధాన కారణం డిమాండ్ కు తగిన ఉత్పత్తి లేకపోవడమే. ఇక నాటు కోడి గుడ్ల విషయానికి వస్తే ఒక్కో గుడ్డు ధర రూ.15 వరకు పలుకుతోంది.గతంలో తెలుగు రాష్ట్రాల్లో రోజుకు సుమారు 8కోట్ల గుడ్లు ఉత్పత్తి అయ్యేవి. అయితే, కోళ్ల ఫారాల నిర్వహణ ఖర్చులు తడిసి మోపెడవుతున్న నేపథ్యంలో చాలా మంది పౌల్ట్రీ యాజమానులు ఈ రంగానికి దూరమవుతున్నారు. కోళ్లకు పెట్టే దాణా, మక్కలు, సోయా, చేపపొట్టు వంటి ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరగడం వల్ల చిన్న, మధ్యతరహా రైతులు కోళ్ల ఫారాలను మూసివేస్తున్న పరిస్థితి. గతంలో కోల్డ్ స్టోరేజీల్లో దాదాపు 20కోట్ల గుడ్లు నిల్వ ఉండేవని, ప్రస్తుతం ఆ నిల్వలు పూర్తిగా తగ్గిపోయాయని వ్యాపారులు చెబుతున్నారు.ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో మరికొద్దిరోజులు కోడిగుడ్డు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు. కోళ్ల దాణాపై సబ్సిడీ ఇవ్వడం లేదా ఉత్పత్తిని పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే తప్ప ధరలు అదుపులోకి వచ్చే సూచనలు కనిపించడం లేదు.

# క్వాంటం వ్యాలీ.. కొత్త దిశ







విజయవాడ, : అమరావతి ఇక కేవలం రాజధాని మాత్రమే కాదు. రానున్న కాలంలో దేశానికి దిశ చూపే టెక్నాలజీ కేంద్రంగా మారేందు కు అడుగులు వేస్తోంది. క్వాంటం టెక్నాలజీ వంటి అత్యాధునిక రంగంలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, పరిశోధనలు, ఉద్యోగాల కల్పన.. ఆల్ ఇన్ వన్ కాన్సెప్ట్ అమరావతి నుంచే ప్రారంభం కానుంది. తాజాగా క్వాంటం వ్యాలీకి నిధులు విడుదల చేయడంతో ఈ దిశగా ప్రభుత్వ సంకల్పం మరోసారి స్పష్టమైంది. 'ఉద్యోగాలే ఉద్యోగాలు' అన్న నినాదం కాగితాలకే పరిమితం కాకుండా, గ్రౌండ్ పై కనిపించే దశకు చేరుతోంది. సీఎం నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన సీఆర్డీయే 65వ అథారిటీ సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలు అమరావతి భవిష్యత్తుకు మైలురాయిగా నిలుస్తున్నా యి.క్వాంటం వ్యాలీకి సంబంధించిన ప్రత్యేక భవనాల నిర్మాణానికి టెండర్లు ఖరారు కావడం, అదనంగా మరిన్ని భవనాల నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించడం అన్నీ కలిపి అమరావతిని టెక్నాలజీ మ్యాప్‌లో మరో మెట్టు ఎక్కిస్తున్నాయి. ప్రపంచం వేగంగా మారుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెమీ కండక్టర్లు, డేటా అనలిటిక్స్‌తో పాటు ఇప్పుడు క్వాంటం టెక్నాలజీ దేశాల భవిష్యత్తును నిర్ణయించే రంగంగా మారింది. కంప్యూటింగ్ శక్తిని విప్లవాత్మకంగా మార్చే ఈ టెక్నాలజీలో ముందడుగు వేయడం అంటే భవిష్యత్తును ముందే అందుకోవడమే. ఆ అవకాశాన్ని అమ రావతి సొంతం చేసుకుంటోంది. క్వాంటం వ్యాలీ లక్ష్యం ఒక్క పరిశో ధన కేంద్రం మాత్రమే కాదు. ఇది ఒక పూర్తి ఎకోసిస్టమ్. రీసెర్చ్ ల్యాబ్స్, స్టార్టప్ ఇన్క్యుబేషన్, ఇండస్ట్రీ భాగస్వామ్యం, గ్లోబల్ ఇన్వెస్ట్మెం ట్స్.. అన్నీ కలిసి పనిచేసే వ్యవస్థ. దీనివల్ల నేరుగా, పరోక్షంగా వేలాదిఉద్యోగాలు సృష్టించే అవకాశంఉందని ప్రభుత్వ అంచనా. సీఆర్డీయే సమావేశంలో తీసుకున్న ప్రధాన నిర్ణయాల్లో ఒకటి.. క్వాంటం వ్యాలీలో ఎక్విప్‌మెంట్ కోసం ప్రత్యేక భవనం నిర్మించడం.

సుమారు 43,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో, 103.96 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఈ భవనానికి టెండర్లు పిలిచి ఒ1ను ఖరారు చేశారు. ఇది రెండు ఎకరాల విస్తీర్ణంలో, టెక్నికల్ నిపుణుల డిజైన్ ప్రకారం నిర్మించనున్నారు. ఈ భవనం సాధారణ కార్యాలయంగా కాదు. అత్యాధునిక క్వాంటం పరికరాలు, సెన్సిటివ్ ఎక్విప్‌మెంట్, పరిశోధనల కోసం అవసరమైన ప్రత్యేక వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్మించనున్నారు. టెంపరేచర్ కంట్రోల్, వైబ్రేషన్ ఫ్రీ ఫ్లోర్స్, సెక్యూరిటీ అన్నీ కలిపి ప్లాన్ చేసినవిక్వాంటం వ్యాలీలో మరో రెండు భవనాల నిర్మాణాన్ని కూడా వెంటనే చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రాజెక్టులు ఆలస్యం కాకుండా, టైమ్‌లైన్‌కు కట్టుబడి ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. "డిజైన్ దశలోనే ఆలస్యం చేయొద్దు. పనులు మొదలైతే ఆగకూడదు" అన్నది ముఖ్యమంత్రి స్పష్టం చేసిన దిశ. ఈ రెండు భవనాలు రీసెర్చ్ టీమ్స్, స్టార్టప్స్, గ్లోబల్ కంపెనీలకు అవసరమైన ఆఫీస్, ల్యాబ్ స్పేస్‌గా ఉపయోగపడనున్నాయి. అంటే, క్వాంటం వ్యాలీ ప్రారంభ దశ నుంచే కార్యకలాపాలు గట్టిగా మొదలయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు.క్వాంటం వ్యాలీ వల్ల ఉద్యోగాలు ఎలా వస్తాయి? అన్న ప్రశ్న సహజం. ఇది కేవలం ఒక ప్రభుత్వ ప్రాజెక్ట్ కాదు. ఇది ఒక మల్టీ-లేయర్ ఎకోసిస్టమ్. మొదటి దశలో నిర్మాణ పనుల ద్వారానే వందల మంది కార్మికులకు ఉపాధి. ఇంజినీర్లు, టెక్నికల్ సిబ్బంది, సపోర్ట్ స్టాఫ్? అందరూ అవసరం.రెండో దశలో పరిశోధన కేంద్రాలు ప్రారంభమవుతాయి. ఫిజిక్స్, మ్యాథ్స్, కంప్యూటర్ సైన్స్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న యువతకు రీసెర్చ్ అసిస్టెంట్స్, సైంటిస్ట్లు, ల్యాబ్ టెక్నీషియన్లుగా అవకాశాలు. మూడో దశలో స్టార్టప్స్. క్వాంటం కంప్యూటింగ్, క్వాంటం సెక్యూరిటీ, క్వాంటం సెన్సార్స్ వంటి రంగాల్లో స్టార్టప్స్ రావడం ద్వారా సాఫ్ట్‌వేర్ డెవలపర్స్, డేటా సైంటిస్ట్లు, హార్డ్‌వేర్ ఇంజినీర్లకు భారీగా ఉద్యోగాలు.

నాలుగో దశలో గ్లోబల్ కంపెనీలు. ఒకసారి ఎకోసిస్టమ్ ఏర్పడితే, పెద్ద కంపెనీలు అమరావతిని తమ ఆర్‌అండ్‌డీ హబ్‌గా ఎంచుకునే అవకాశం ఉంది. అప్పుడు ఉద్యోగాల సంఖ్య వేలల్లోకి వెళు ్తందిఇప్పటివరకు ఐటీ అంటే బెంగళూరు, హైదరాబాద్ అన్న భావన ఉండేది. క్వాంటం వ్యాలీతో అమరావతి కూడా ఆ లిస్టులో చేరనుంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ యువతకు ఇది గోల్డెన్ ఛాన్స్. బయట రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి తగ్గే అవకాశం ఉంది. ఇక్కడే చదువు, ఇక్కడే పరిశోధన, ఇక్కడే ఉద్యోగం?అన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. విశ్వవిద్యాలయాలు, ఇంజినీరింగ్ కాలేజీలతో లింకేజ్ ఏర్పడితే, స్టూడెంట్స్‌కు ఇంటర్న్‌షిప్స్, ప్రాజెక్ట్ వర్క్, ప్లేస్‌మెంట్స్? అన్నీ కలిపి ప్లాట్‌ఫామ్‌గా క్వాంటం వ్యాలీ మారుతుంది. అమరావతి బ్రాండ్ బలపడేలా క్వాంటం వ్యాలీ కేవలం ఒక ప్రాజెక్ట్ కాదు. ఇది అమరావతి బ్రాండ్‌ను గ్లోబల్ మ్యాప్‌పై నిలబెట్టే ప్రయత్నం. ఇప్పటివరకు అమరావతి అంటే పరిపాలనా రాజధాని అనే గుర్తింపు. ఇకపై టెక్నాలజీ రాజధానిగా కూడా గుర్తింపు పొందే దిశగా అడుగులు పడుతున్నాయి. ఇది ఇతర రంగాలకు కూడా ఊతమిస్తుంది. హౌసింగ్, రియల్ ఎస్టేట్, ఎడ్యుకేషన్, హెల్త్‌కేర్? అన్ని రంగాల్లో ఉద్యోగాలు పెరిగితే నగరంలో ఆర్థిక చక్రం వేగం పెరుగుతుంది. స్పష్టమైన విజన్ సీఆర్డీయే సమావేశంలో కనిపించింది.

## వైద్యులు అందుబాటులో ఉండాలి

### టెక్మాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**మెదక్,తెలంగాణ దిశ :** వైద్యులు అందుబాటులో ఉండి సేవలందించాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. టేక్మాల్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ,ఐపీ, ఫార్మసీ, ల్యాబ్, టాయిలెట్స్, పరిశీలిం చారు. వైద్యులు, అధికారులకు పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధుల కేసులు, వాటికి సంబంధించిన మందులు అన్ని అందు బాటులోఉన్నాయా అనిఅడిగి తెలుసుకున్నారు. దవాఖానలో ఇబ్బ ందులు ఏమైనా ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. అనంత రం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలందరికి అందుబాటులో వైద్య సేవలు అందించేందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నామని తెలిపారు. వ్యాధుల నియంత్రణ, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ వైద్య సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# మిర్చి ధర పైపైకి..

**ఒక్కరోజే రూ.2,400 చొప్పున పెరిగిన ధర**
**సరుకు పెరిగినా ఇదే ధర ఉండాలని కోరుకుంటున్న రైతులు**



**రఘునాథపాలెం,తెలంగాణ దిశ :**ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి ధర పైపైకి వెళ్తున్నది. మంగళవారంతో పోల్చితే ఒక్క రోజులోనే భారీగా ధర పెరిగింది. ఈ ఏడాది ఇదే అధిక పెరుగుదల అని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. క్వింటా ఏసీ మిర్చి ధర రూ.20,200, కొత్త మిర్చి ధర రూ.20 వేలకు చేరింది. దీంతో పంట విక్రయానికి తరలించిన రైతుల్లో ఆశలు చిగురించాయి. వారం రోజుల క్రితం మిర్చి ధర కేవలం రూ.15 వేలకే పరిమితమైంది. అయితే రెండు రోజులుగా వరుసగా పెరుగుతూ వచ్చిన మిర్చి ధర బుధవారం నాటికి రూ.20 వేల మార్క్‌ను చేరింది. వ్యవసాయ మార్కెట్‌కు కొత్త మిర్చి భారీగా వస్తుండడంతో ధరలో పురోగతి కనిపిస్తున్నది. 2024లో మిర్చి క్వింటా ధర రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు పలికింది. రెండేళ్లుగా తెలంగాణ మిర్చికి విదేశాల్లో డిమాండ్ లేకపోవడంతో ధర భారీగా పడిపోయింది. కాగా, ఈ ఏడాది తెగుళ్లు, అధిక వర్షాల కారణంగా దిగుబడులు పూర్తిగా తగ్గాయి. ఏటా లక్ష ఎకరాల్లో సాగయ్యే మిర్చి.. ఈ ఏడాది కేవలం 40 వేల ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. ఈ క్రమంలో దిగుబడులు తగ్గడంతో విదేశీ మార్కెట్‌లో మిర్చికి డిమాండ్ పెరిగింది. కాగా, బుధవారం ఖమ్మం మార్కెట్‌కు 13 వేల బస్తాలు వచ్చినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. సీజన్‌లో మార్కెట్‌కు వచ్చే సరుకు పెరిగినప్పటికీ ఇదే ధర నిలకడగా ఉండాలని రైతులు కోరుతున్నారు.


# సామ్రాజ్యవాద పెనుముప్పు

అమెరికా సామ్రాజ్యవాదం బుసలుకొడుతోంది. నిన్న వెనిజులాపై ఆకస్మిక దాడి చేసి, వందలాదిమందిని హత్య చేసి, అధ్యక్షుడు మదురోను, ఆయన భార్యను అర్ధరాత్రి వేళ సైనిక విమానంలో ఎత్తుకెళ్లడం, నేడు గ్రీన్‌లాండ్స్‌ను కబళించేందుకు సిద్ధం కావడం, ఇరాన్, క్యూబా, మెక్సికో, కొలంబియా లాంటి దేశాలపై బెదిరింపులకు దిగడం× ఇవన్నీ సామ్రాజ్యవాద వికృతరూపానికి ఆనవాళ్లు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూకుడుతో పాటు అగ్రరాజ్య దురహంకారానికి ప్రతిరూపాలే.

ప్రస్తుతం గ్రీన్‌లాండ్‌పై యుద్ధ మేఘాలు ఆవరించాయి. ఆ ద్వీపంలోని కీలక సైనిక స్థావరం పిటుఫిక్ స్పేస్ బేస్‌కు సైనిక విమానం పంపుతున్నట్టు ఇప్పటికే అమెరికా ప్రకటించింది. ప్రపంచంలోనే అతి పెద్దదైన ఈ దీవిలో అత్యంత అరుదైనవిగా ప్రకటించిన 34 ఖనిజాల్లో గ్రాఫైట్, లిథియం వంటి 25 ఖనిజాలు అపారంగా ఇక్కడ ఉన్నాయి. విద్యుత్ వాహనాల తయారీలో చాలా కీలకమైన వీటిని, చమురు, సహజ వాయువును వెలికితీస్తే పర్యావరణానికి ముప్పేనన్న స్పృహతో అక్కడి ప్రభుత్వం 2019 నుంచి నిషేధం విధించింది. వీటన్నింటినీ చేజిక్కించుకునేందుకే రష్యా, చైనా బూచి చూపడం సహా ట్రంప్ వాచాలత. అభ్యంతరం చెప్పిన యూరోపియన్ యూని యన్ దేశాలపై వచ్చే నెల 1 నుంచి 10 శాతం సుంకాలు విధిస్తాననడం కయ్యానికి కాలుదువ్వడమే!

గాజా పునర్నిర్మాణం కోసమంటూ తాను శాశ్వత అధ్యక్షుడిగా శాంతి మండలి ఏర్పాటు చేస్తాననడం, దానికి మనదేశం సహా 60 దేశాలను ఆహ్వానించడం మరో ప్రమాదక ర పోకడ. తలా తోకా లేకుండా ఐక్యరాజ్య సమితిని నిర్వీర్యం చేసేలా ఉన్న ఈ ఎత్తుగడ గాజా వాసులకు సహాయం అందకుండా చేసి తరిమేయడానికి, జాతి నిర్మూలనకు, ఆ ఆనవాళ్లు చెరిపేయడానికే.

మెరికా ఆంక్షలతో ఇరాన్, రష్యా, వెనిజులా తదితర దేశాలు వివిధ కరెన్సీల్లో చమురు అమ్మకాలు జరపడంతో డాలర్ ఆధిపత్యానికి కొంతమేర గండిపడటం, వాణిజ్యలోటు అంతకంతకూ పెరిగిపోతుండటం, ప్రపంచంలోనే అతిపెద్ద రుణగ్రస్థ దేశంగా కొనసాగుతుండటం లాంటి సవాళ్లను అధిగమించడానికి అగ్రరాజ్యం




విధ్వంసకర ఎత్తుగడలకు పూనుకోవడం గర్హనీయం. ఒకప్పుడు తన వలసలుగా ఉన్న దేశాల్లోని సంపదనంతా తరలించుకుపోయిన బ్రిటీష్ సామ్రాజ్యవాదుల తరహాలోనే× ప్రపంచంపై పెత్తనం చేయాలనుకోవడం ఆందోళనకరం. దిగుమతులపై అధిక సుంకాలు విధించడం, చమురు, సహజవాయువు లాంటి ఇంధనాలను నిల్వవుంచుకునే పద్ధతికి భిన్నంగా అమ్మకాలు జరపడం, విలువైన వనరులున్న దేశాలను నయా వలసలుగా చేసుకుని, వాటిని కొల్లగొట్టడం, ఇజ్రాయిల్ ద్వారా మధ్యప్రాచ్యమంతటా మంటలు రాజేయడం, వెనిజులాకు తానే అధ్యక్షుడినని ట్రంప్ ప్రకటించుకోవడం, ఇరాన్‌లో పాలకులను మార్చేస్తాననడం, క్యూబాకు అమెరికా విదేశాంగ మంత్రి అధ్యక్షుడు అవుతాడనడం ఇవన్నీ అందులో భాగమే. ఒకప్పుడు సామ్రాజ్యవాద దురహంకారాన్ని నిలువరించిన సోవియట్ యూనియన్‌లా బలమైన సోషలిస్టు శిబిరం లేకపోవడంతో అమెరికా ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. లాటిన్ అమెరికాకో, ఇయుకో పరిమితమవుతుందనుకుని చేష్టలుడిగి కూర్చుంటే× మూడో ప్రపంచ దేశాలకూ యుద్ధ మేఘాలు విస్తరించే ప్రమాదం పొంచివుంది. ఎన్ని మాటలన్నా, సరైన పత్రాల్లేవంటూ ప్రవాస భారతీయులను సంకెళ్లు వేసి, గొలుసులతో బంధించి అవమానకరంగా యుద్ధ విమానాల్లో తరలించినా, ఎడాపెడా సుంకాలు విధించి దేశానికి తీరని నష్టం కలిగిస్తున్నా, నిత్యం బెదిరింపులకు పాల్పడుతున్నా మన పాలకులు నోరుమెదపక పోవడం సిగ్గుచేటు. అమెరికా దురహంకార, ఆధిపత్య చర్యలను ఇకనైనా భారత్ ప్రతిఘటించాలి. అంతర్జాతీయ న్యాయ సూత్రాలను, దేశాల స్వాతం(త్యాన్ని కాలరాస్తూ× ప్రపంచాన్ని పెనువిపత్తు దిశగా తీసుకె ళ్తున్న సామ్రాజ్యవాద దురహంకారాన్ని తుదముట్టించడం అత్యావశ్యకం. అందుకు భిన్నంగా వ్యవహరించిన దేశాలను, పాలకులను భవిష్యత్ తరాలు, చరిత్ర క్షమించవు.

## మురికి కాలువలు శుభ్రపరచాలి



కమాన్ పూర్ ,తెలంగాణ దిశ :మురికి కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రపరచాలి అని పెంచికలపేట సర్పంచ్ పల్లె మాధవి నారాయణ అన్నారు. గురువారం కమాన్ పూర్ మండలంలోని పెంచల పేట రెండో వార్డులో మురికి కాలువలు పూర్తిగా చెత్తాచెదారంతో కూర్కపోయాయి. దీంతో సర్పంచ్ పల్లె మాధవి నారాయణ ఆదేశాలతో గ్రామ కార్యదర్శి సూది రెడ్డి ప్రవళిక ఆధ్వర్యంలో కాలువలో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని పూర్తిగా తొలగించారు. అలాగే గ్రామంలో చెత్తాచెదారం లేకుండా చూస్తామని ఎప్పటికప్పుడు గ్రామపంచాయతీ సిబ్బంది తొలగించాలని మురికి నీరు నిల్వ లేకుండా చూడాలని సర్పంచ్ సూచించారు. ఆయా పనులను ఉపసర్పంచ్ చొప్పరి శేఖర్ పరిశీలించారు.

# వైసీపీలో అంతర్గతంగా అసంతృప్తి

**విజయనగరం,తెలంగాణ దిశ :**ప్రస్తుతం వైసీపీలో అంతర్గతంగా అసంతృప్తి పెరుగుతోందన్న మాట ఆ పార్టీ నాయకుల నుంచే వినిపిస్తోంది. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వంపై పైచేయి సాధించేందుకు ఎంచుకున్న వ్యూహాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వడం లేదని వారు భావిస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం వైసీపీ చేస్తోందన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఉంది. ఇవన్నీ గతంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలోనే ప్రారంభమయ్యాయని, ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాటికి క్రెడిట్ తీసుకుంటున్నారని ప్రచారం చేస్తున్నారు.అయితే ఈ ప్రచారం ప్రజల్లో పెద్దగా ప్రభావం చూపడం లేదని పార్టీ నేతలే అంగీకరిస్తున్నారు. ఏ పని చేసినా అది జరిగినప్పుడే చెప్పుకోవాలి అన్న అభిప్రాయం ప్రజల్లో బలంగా ఉందని అంటున్నారు. నిజంగా ఆ పనులు అప్పట్లో జరిగి ఉంటే, అప్పుడే వాటిని ప్రజల ముందు బలంగా ఉంచాల్సిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు ఆలస్యంగా చెప్పుకుంటున్న మాటలకు ప్రజలు పెద్దగా స్పందించడం లేదని వైసీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇంకొక వైపు సోషల్ మీడియా ప్రచారం కూడా పార్టీకి కలిసి రావడం లేదన్న చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి, మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పాల్గొంటున్న కార్యక్రమాల్లో చేసిన వ్యాఖ్యలను కోట్ చేస్తూ, వాటిని వక్రీకరించి పోస్టులు పెట్టడం ద్వారా లాభం ఉంటుందని భావించారు. కానీ ఈ ప్రయత్నం కూడా ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయిందని నేతలే చెబుతున్నారు. ఇలాంటి అనుచిత ప్రచారం వల్ల ప్రభుత్వానికి నష్టం కంటే, తమకే నష్టం జరుగుతోందన్న భావన పార్టీ లోపల పెరుగుతోంది.మొత్తంగా చూస్తే వైసీపీ ఎంచుకున్న రాజకీయ ఎత్తులు పనిచేయడం లేదన్న భావన బలపడుతోంది. ఇదే సమయంలో పార్టీ నుంచి బయటకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న నాయకుల సంఖ్య కూడా పెరుగుతోందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ముందుగా వీరిని నిలువరించాల్సిన అవసరం ఉందని కొందరు సూచిస్తున్నా, అధిష్టానం నుంచి స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని అంటున్నారు. పోయేవారు పోతే పోనీయండి అన్న ధోరణి కొనసాగుతుండటంతో మిగిలిన నాయకుల్లోనూ నిరాశ పెరుగుతోంది.ఈ పరిస్థితుల్లో చిన్న అవకాశం దొరికినా పార్టీ వీడేందుకు సిద్ధంగా ఉన్నామని కొందరు బహిరంగంగానే



చెబుతున్నారని సమాచారం. ఒకప్పుడు బలమైన కేడర్, స్పష్టమైన వ్యూహాలతో ముందుకు సాగిన పార్టీ ఇప్పుడు అయోమయంలో ఉందన్న అభిప్రాయం రాజకీయ విశ్లేషకుల్లో వ్యక్తమవుతోంది. ప్రజల నమ్మకాన్ని తిరిగి పొందాలంటే కేవలం ప్రచారంతో కాకుండా, స్పష్టమైన దిశానిర్దేశం, నాయకత్వ నిర్ణయాలు అవసరమన్న చర్చ వైసీపీ వర్గాల్లోనే సాగుతోంది.ఇదిలా ఉండగా, గత ఎన్నికల సమయంలోనే తాను మళ్లీ పోటీ చేయబోనని నాని ప్రకటించారు. తన సోదరుడి కుమారుడిని రాజకీయ వారసుడిగా సూచించినా, పార్టీ పెద్దల ఆలోచన వేరేలా ఉన్నట్లు తెలుస్తోంది. నానిని నియోజకవర్గ రాజకీ యాల నుంచితప్పించి, పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించాలన్న అభిప్రాయంఉన్నట్లు వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. 2029 ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వస్తే, ఆయనకు రాజ్యసభ లేదా ఎమ్మెల్సీ వంటి పదవులు దక్కే అవకాశముందన్న ప్రచారం కొనసాగుతోంది. ఇందులో ఎంత నిజం ఉందో రానున్న రోజుల్లో తేలాల్సి ఉంది.

# లోక్‌పాల్ తోనే రాజకీయ అవినీతికి అడ్డుకట్ట !

త్వం శుంఠ అంటే.. త్వం శుంఠ అన్నట్లుగా తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలు నడుస్తున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు అవినీతికి తెగించడం..వేలకోట్లు సంపాదించడం..అధికారం పోయాక, అధికారంలో ఉన్న పార్టీల అవినీతి గురించి ప్రశ్నించడం చూస్తున్నాం. అధికారంలో ఉన్న వారు, అధికారంలో ఉండి విపక్షంలోకి వచ్చిన వారు చేసిన అవినీతి వల్ల ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో కోలుకోలేని అప్పుల్లో కూరుకుని పోయాయి. ఇది వాస్తవం. విభజన వల్ల జరిగిన మేలు ఇదే. ఇందుకు నాలుగు పార్టీల నాయకులు బాధ్యులు. బిఆర్ఎస్‌గా మారిన టిఆర్ఎస్, కాంగ్రెస్, తెలుగుదేశం, వైకాపాలు ఈ అప్పులకు బాధ్యత వహించాలి. తెలుగు రాష్ట్రాల అప్పులను ఈ పార్టీల నుంచి వసూలు చేయాలి. అప్పుడే ఈ రెండు రాష్ట్రాలు అప్పుల ఊబినుండి బయటపడతాయి. ఇకపోతే నేతలకు సవాళ్లు విసురకోవడం అలవాటుగా మారింది. అధికారంలో ఉండగా తాము చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకు, ఇప్పుడు అధికారంలో ఉన్న పార్టీలను నిందస్తున్నారు. ఇందులో ఎవ్వరేమీ తక్కువ తినలేదు. అందుకే రాజకీయ అవినీతిపై ఉన్నతస్థాయి దర్యాప్తు జరగాలి. సాధారణ పోలీసులతో ఇది సాధ్యం కాదు. ప్రత్యేక వ్యవస్థను రూపొందించాలి. అన్నా హజారే కోరినట్లుగా లోక్‌పాల్ వ్యవస్థను తీసుకుని రావాలి. అప్పుడే స్వతంత్ర దర్యాప్తు కొనసాగుతుంది. అవినీతిపై నిగ్గు తేలుస్తారు. రాజీకయ పార్టీలు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలకు చట్టాలు తేవాలి. ప్రస్తుత సమాజంలో బాగా వేళ్లూనుకున్న అవినీతి ఎక్కడయినా ఉందంటే అది రాజకీయ పార్టీల్లోనే. పటిష్ట లోక్‌పాల్ వ్యవ్స్థ ద్వారానే అవినీతి నేతలను శిక్షించగలం. అందుకు ప్రజా ఉద్యమాలు రావాలి. ఆప్ ఉద్యమంలా కాకుండా ప్రజలు, మేధావులు కలసి ఉద్యమించాలి. ఇక తెలుగు రాష్ట్రాల విషయాలకు వస్తే జగన్, వైకాపా అవినీతిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కెసిఆర్, ఆయన కుటుంబం, బిఆర్ఎస్ నేతల అవినీతిపైనా చర్యలు ముందుకు సాగడం లేదు. తాజాగా కాంగ్రెస్ అవినీతి బట్టబయలు అయ్యింది. ఈ క్రమంలో వీరి అవినీతిపై చర్యలు ఉంటాయనుకోవడం కూడా అత్యాశే అవుతుంది. తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సిట్ తన దర్యాప్తును ముమ్మరం చేసింది. రెండేళ్లుగా సాలీడు దారంలా సాగుతోంది. ఇందులో భాగంగా తాజాగా మాజీ మంత్రి హరీష్‌రావును సిట్ అధికారులు 7 గంటలపాటు విచారించారు. సిట్ విచారణపై ఇప్పుడు బిఆర్ఎస్ నేతలు ఎదురుదాడికి దిగుతున్నారు. రేవంత్ రెడ్డి నీకు దమ్ముంటే నాకు నోటీసులు ఇవ్వడం కాదని, రాజకీయంగా కొట్లాడుదాం అని హరీష్ రావు సవాల్ విసిరారు. కాళేశ్వరం సహా అనేక అవినీతి కేసులు ఉన్నా ఆ పార్టీ నేతలు బరితెగించి మాట్లాడుతున్నారు. వారి అవినీతిని ప్రశ్నిస్తున్న అధికార కాంగ్రెస్ నేతలు తామూ అవినీతి బురదలో కూరుకు పోయారు. ఒక్కో మంత్రి మీద ఒక్కో అవినీతి బయటపడుతోంది. దీనినిబట్ట అవినీతి రాజకీయ పార్టీల హక్కుగా మారిందని అర్థం చేసుకోవాలి. ఫోన్ ట్యాపింగ్, ఈ కార్ రేసు, కాళేశ్వరం వంటివనీ పిచ్చకుంట్ల, లొట్టపీసు కేసులని బిఆర్ఎస్ వాదిస్తోంది. కాగ్రెస్ పై ప్రజలు తిరగబడే రోజులు దగ్గర లోనే ఉన్నాయని హరీష్ రావు వ్యాఖ్యానించడం, ఆయన తప్పించుకునే రాజకీయ తెలివిని ప్రదర్శించారని గుర్తించాలి. ఇకపోతే సింగరేణి సంస్థ నిబంధనలు మార్చి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన బావమరిదికి రూ.1,600 కోట్ల టెండర్లు కట్టబెట్టారని బిఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. బొగ్గు కుంభకోణంపై నిగ్గు తేల్చడం కోసం సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కార్ అనేక కుంభకోణాలకు పాల్పడిందని, రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని మండిపడ్డారు. మంత్రుల వద్ద వాటాల పంచాయితీ నడుస్తున్నదని దుయ్యబట్టారు. గతంలో సింగరేణిపై ఏ ప్రభుత్వం కూడా అజమాయిషి చేయలేదని, కానీ, రేవంత్ సర్కార్ మాత్రం అజమాయిషీ చేస్తూ, తద్వారా సంస్థను నిర్వీర్యం చేస్తున్నదని దుయ్యబట్టారు. మొత్తానికి వజ్రాన్ని వజ్రంతోనే కోయాలని అంటారు. అవినీతి ఆరోపణలను అవినీతి ఆరోపణలతో తిప్పికొట్టడం ఇప్పుడు రాజకీయ పార్టీలకు అలవాటుగా మారింది. సింగరేణి సంస్థకు నష్టం చేకూరేలా చేస్తున్నారన్న ఆరోపణలు వచ్చినప్పుడు దానిని సరిదిద్దుకొని సంస్థ ఖజానాకు గండి పడకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీది. సింగరేణిపై కాంగరెస్, బిఆర్ఎస్ పార్టీలు గద్దల్లా పడి దోచుకుంటున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఆరోపించారు. బొగ్గు మంత్రిగా ఉన్నా కిషన్ రెడ్డి ఏం చేస్తున్నట్లు అన్నది చెప్పాలి. కేంద్రం నిజాయితీగా ఎందుకు వ్యవహరించడం లేదు. అవినీతిపరులను ఎందుకు బోను ఎక్కించడం లేదు. ఇవన్నీ శేష ప్రశ్నలు. సాధారణ టెండర్లలోనూ బిడ్ వేసే ముందు కాంట్రాక్టర్లు పనిచేసే ప్రాంతాన్ని సందర్శించి టెండర్ నోటిఫికేషన్‌లో పేర్కొన్న వివరాలతో బేరీజు వేసుకుంటారు. ప్రీబిడ్ సమావేశంలో తమ అనుభవాలు, సమస్యలు, అభ్యంతరాలను అధికారుల ముందు ఉంచి పరిష్కారాలు, వెసులుబాట్లను ప్రతిపాదిస్తారు. కానీ సింగరేణి టెండర్లు మైనింగ్‌కు సంబంధించినవైనందున భౌగోళిక పరిస్థితులతో ముడిపడి ఉంటుంది. అవినీతి వ్యవహారాలు పునరావృతం కాకుండా ఉండాలంటే కచ్చితంగా టెండర్ నోటిఫికేషన్‌లోనే కొత్త షరతులు పెట్టాల్సి ఉంటుంది. ఒడిశా అంగూల్ జిల్లాలోని నైని కోల్‌బ్లాక్‌ను 2015లో దక్కించుకున్న సింగరేణి సంస్థ, 2200 ఎకరాల విస్తీర్ణంలోని ఆ బ్లాకులో 200 ఎకరాల విస్తీర్ణానికి బీఆర్ఎస్ హయాంలోనే టెండర్లు పూర్తి చేసి, పనులు అప్పగించింది. కాంపిటీటివ్ బిడ్డింగ్ విధానంలో ఐదేండ్ల పాటు బొగ్గు వెలికితీతకు పిలిచిన ఆ టెండర్లలో ఐదు సంస్థలు పోటీపడ్డాయి. చివరికి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి చెందిన వీపీఆర్ సంస్థ టెండర్ దక్కించుకున్నది. రోజుకు 30వేల క్యూబిక్ మీటర్ల ఓబీని ఈ సంస్థ వెలికి తీస్తున్నది. అతను కూడా రాజకీయ పార్టీకి చెందిన వాడే ఆవడంతో అవినీతికి ఆస్కారం ఏర్పడింది. టెండర్ విధానాన్ని పారదర్శకంగా నిర్వహించాలనుకుంటే సైట్‌ను పరిశీలించిన ప్రతి కంపెనీకి ఇప్పటికే సర్టిఫికెట్లు జారీ చేయాల్సి ఉన్నది. ఆ మేరకు సుశీ కంపెనీతో పాటు పలు కంపెనీలు కూడా పదేపదే అధికారులకు ఫోన్ చేసి తమకు సర్టిఫికెట్ జారీ చేయాలని కోరుతున్నా అధికారులు జారీ చేయలేదంటే.. ప్రభుత్వ పెద్దల ఆదేశాల కోసం వేచి చూస్తున్నారనేది బహిరంగ రహస్యం. అయితే నైనీ టెండర్లకు సంబంధించి అసలు ఈ సర్టిఫికెట్ ఎవరు జారీ చేయాలనే దానిపైనా సింగరేణిలో స్పష్టత లేదనే ప్రచారం జరుగుతుందంటే పక్రియ ఎంత గుడ్డిగా కొనసాగుతున్నదో అర్థం చేసుకోవచ్చు. ఈ వ్యవహారంలో విచారణ జరగాలి. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో వస్తున్న ఆరోపణలపై విచారణ జరగాలి. బిఆర్ఎస్ పదేళ్ల పాపాలపైనా విచారణ సాగాలి. చంద్రబాబు, జగన్ పాపాలపైనా విచారణ జరగాలి. అందుకు లోక్‌పాల్ ఒక్కటే శరణ్యం.

## కామారెడ్డి జిల్లాలో విషాదం..

**కోతుల గుంపుపై విష ప్రయోగం, పలు వానరాలు మృతి**



హైదరాబాద్ : కామారెడ్డిజిల్లా విషాదం చోటు చేసుకుంది. కోతులపై విషయ ప్రయోగం చేయడంతో పది కోతులు మృతి చెందాయి. మరికొన్ని కోతులు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుండా పశు వైద్య సిబ్బంది కాపాడారు. ఈ విషాదాకర సంఘటన బిక్కనూరు మండలం అంతంపల్లి సమీపంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గుర్తుతెలియని వ్యక్తులు కోతులను అంతంపల్లి సమీపంలోని ఓ హొటల్ వద్ద వదిలిపోయారు. కోతులు మృతి చెంది ఉండటాన్ని గమనించిన స్థానిక సర్పంచ్ ఏనుగు మంజుల వెంటనే పోలీసులతో పాటు అటవీ శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించగా ఎవరో వాహనంలో సుమారు 150 నుంచి 200 వరకు కోతులను తీసుకొచ్చి వదిలిపెట్టనట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, ఇటీవల కాలంలో దుండగులు మూగజీవాలకు విషం పెట్టి చంపి వేస్తున్న సంఘటనలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఇది గ్రామస్తులకు, పశువులకు కూడా ప్రమాదకరమని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ప్రభుత్వాలు స్పందించి నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# 5 వేల కోట్ల కోసం 42 ఎకరాల భూమి అమ్మకం



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** హైదరాబాద్‌లో మరోసారి భూములు వేలం వేయడానికి తెలంగాణ ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. మూసాపేట, బంజారాహిల్స్, కొండాపూర్‌లో మొత్తం 42 ఎకరాలను వేలం వేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీని ద్వారా సుమారు రూ. 5 వేల కోట్లు సేకరించాలని టార్గెట్‌గా పెట్టుకుంది. దీనికి సంబంధించి హెచ్ఎండీఏ ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. అయితే గతంలో హైదరాబాద్‌లో జరిగిన భూముల వేలాల్లో రికార్డు ధరలు పలికాయి. దీంతో ఈసారి కూడా భారీ స్పందన వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో మరోసారి భూములు వేలం వేయడానికి సిద్ధమవుతోంది. మొత్తం 42 ఎకరాల భూమి వేలం వేయాలని నిర్ణయించింది. దీని ద్వారా దాదాపు రూ. 5 వేల కోట్లు సేకరించాలని టార్గెట్‌గా పెట్టుకుంది. కాగా, భాగ్యనగరంలో భూములు వేలం వేసిన ప్రతిసారి రికార్డు ధరలు పలుకుతున్నాయి. ఇటీవల కోకాపేటలో ఎకరం రూ. 151 కోట్లు పలికింది. అంతకుముందు రాయదుర్గంలో జరిగిన వేలంలో ఎకరం ఏకంగా రూ. 177 కోట్లు పలికి రికార్డు సృష్టించింది. ఈ తరుణంలో త్వరలో జరగబోయే వేలంలో ఎకరం ఎంత పలుకుతుంది అనేది ఆసక్తిగా మారింది.మూసాపేటలో 14 ఎకరాలు, బంజారాహిల్స్‌లో 8.37 ఎకరాలు, కొండాపూర్‌లో 20 ఎకరాల వేలం వేయడానికి హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) కసరత్తు చేస్తోంది. దాదాపు రెండు నెలల క్రితం కోకాపేటలో భూములు వేలం వేసినప్పుడే.. మూసాపేటలో భూములను కూడా విక్రయించాలనిలని ప్రభుత్వం భావించింది. అయితే భూములు వేలం వేయొద్దంటూ స్థానికులు, ప్రజాప్రతినిధుల నుంచి వ్యతిరేకత రావడం వల్ల.. ప్రభుత్వం వెనక్కి తగ్గింది. కాగా, ఆ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, రాత్రికి రాత్రే నిర్మాణాలు చేపడుతున్నారని అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడంతో మరోసారి ఈ భూముల వేలం మరోసారి తెరపైకి వచ్చింది. ఆ నివేదికను పరిశీలించిన ప్రభుత్వం.. స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చలు జరిపి భూములను వేలం వేసేందుకు ఆమోదం తెలిపింది.బంజారా హిల్స్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సుమారు 15 ఎకరాల వరకు ఉన్న భూమి.. చాలా వరకు కబ్జాకు గురైంది. ప్రభుత్వ స్థలంలోకి నిర్మాణాలు చొచ్చుకొచ్చాయి.

దీంతో కొండ ప్రాంతాన్ని పక్కకు పెట్టి.. 8.37 ఎకరాలను విక్రయించాలని ప్రభుత్వం భావించింది. కొండాపూర్‌లో 20 ఎకరాలు, మూసాపేటలోని 14 ఎకరాలు కలిపి మొత్తం 42 ఎకరాలను ఆన్‌లైన్‌లో వేలం వేసేందుకు హెచ్ఎండీఏ కసరత్తు చేస్తోంది.మరోవైపు, హైదరాబాద్ ప్రపంచస్థాయి నగరంగా అభివృద్ధి చెందుతోంది. భారత్‌లోని టాప్ నగరాలతో పోటీ పడుతూ అత్యంత నివాసయోగ్యమైన ప్రాంతంగా గుర్తింపు పొందుతోంది. మౌలిక సదుపాయాలు, మానవవనరులు పుష్కలంగా ఉండటంతో.. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన సంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యాలయాలను ప్రారంభించడానికి ఆసక్తి చూపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారీ నిర్మాణ ప్రాజెక్టులు చేపట్టాలనుకునే సంస్థలకు భూములు దొరకడం కష్టంగా మారింది. ప్రైవేటు స్థలాలు వివిధ ప్రాంతాల్లో ఉన్నా.. విక్రయించడానికి యజమానులు ముందుకు రావడం లేదు. ఈ నేపథ్యంలో గతంలో టీజీఐఐసీ, హెచ్ఎండీఏలు వేలం వేసిన భూములకు మంచి రెస్పాన్స్ వచ్చింది. మూసాపేట, బంజారాహిల్స్, కొండాపూర్‌లో కూడా అలాంటి రెస్పాన్స్ వచ్చి.. రూ. 5 వేల కోట్ల టార్గెట్ చేరుకుంటామని ప్రభుత్వం భావిస్తోంది.


# తెలుగు రాష్ట్రాల మధ్య చిచ్చు

## 42 ఎకరాల భూమి

**విజయవాడ,తెలంగాణ దిశ :** హైదరాబాద్‌లోని అత్యంత ఖరీదైన కొండాపూర్ ప్రాంతంలో గల 42 ఎకరాల భూమి ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టింది. సుమారు 4,000 కోట్ల రూపాయల విలువ చేసే ఈ భూమిపై తమకే అధికారం ఉందంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ హైకోర్టులో కౌంటర్ దాఖలు చేయడంతో ఈ వివాదం సరికొత్త మలుపు తిరిగింది. కర్నూలు కేంద్రంగా పనిచేసే బాలసాయిబాబా సెంట్రల్ ట్రస్ట్ కు చెందిన ఈ భూములపై తెలంగాణ ప్రభుత్వానికి ఎలాంటి అధికారం లేదని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేయడం సంచలనంగా మారింది.ఈ వివాదానికి మూలాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలోనే ఉన్నాయి. కర్నూలు జిల్లా కేంద్రంగా బాలసాయిబాబా సెంట్రల్ ట్రస్ట్ రిజిస్టర్ అయింది. ఈ ట్రస్ట్‌కు కొండాపూర్‌లోని సర్వే నంబర్లు 105 నుంచి 108 వరకు సుమారు 42.03 ఎకరాల భూమి ఉంది. 2005లో అప్పటి ప్రభుత్వం జీఓ 2065 ద్వారా ఈ యూఎల్‌సీ మిగులు భూములను ట్రస్ట్‌కు క్రమబద్ధీకరించింది. బాలసాయిబాబా మరణం తర్వాత ట్రస్ట్ నిర్వహణ బాధ్యతలను ఏపీ దేవాదాయ శాఖ చేపట్టింది. కర్నూలు దేవాదాయ శాఖ కార్యనిర్వహణాధికారిని ఈ ట్రస్ట్‌కు అధికారిగా నియమించారు.ఈ వివాదంలో ప్రైవేటు సంస్థ అయిన భూపతి ఎస్టేట్స్ ప్రవేశించడంతో సమస్య సంక్లిష్టంగా మారింది. 2023లో తెలంగాణ ప్రభుత్వం రెవెన్యూ రికార్డులలో మార్పులు చేస్తూ, ట్రస్ట్ పేరుకు బదులుగా 'భూపతి ఎస్టేట్స్' పేరును చేర్చింది. బాలసాయి బాబా ట్రస్ట్ భూములను ఈ ప్రైవేటు సంస్థకు అప్పగించడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. తమకు సమాచారం ఇవ్వకుండా, ఏపీ పరిధిలో ఉన్న ట్రస్ట్ భూములను తెలంగాణ ప్రభుత్వం ఎలా బదలాయిస్తుందని ఏపీ దేవాదాయ శాఖ ప్రశ్నిస్తోంది. ఈ క్రమబద్ధీకరణ చెల్లదని, తెలంగాణ తీసుకున్న నిర్ణయం చట్టవిరుద్ధమని ఏపీ ప్రభుత్వం వాదిస్తోంది.తమ్మనబోయిన సంతోష్ కుమార్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిల్ పై విచారణ సందర్భంగా ఏపీ దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్రమోహన్ కీలకమైన కౌంటర్ దాఖలు చేశారు. ఈ ట్రస్ట్ ఆంధ్రప్రదేశ్ చట్టం కింద ఏపీలో రిజిస్టర్ అయింది. కాబట్టి దాని ఆస్తుల నిర్వహణ ఏపీ దేవాదాయ శాఖ పరిధిలోకే వస్తుంది. రాష్ట్ర విభజన తర్వాత ఆయా రాష్ట్రాల్లోని భూములు ఆ రాష్ట్రాలకే చెందుతాయన్న నియమం ఉన్నప్పటికీ, ఒక రాష్ట్ర దేవాదాయ శాఖ పరిధిలోని ట్రస్ట్ ఆస్తులను మరో రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు ఎలా కట్టబెడుతుందని ఏపీ ప్రశ్నిస్తోంది. ఈ భూములపై తెలంగాణకు ఎలాంటి పరిపాలనాపరమైన అధికారం లేదని ఏపీ తేల్చి చెప్పింది.తెలంగాణ ప్రభుత్వం ఈ భూములు తమ భౌగోళిక పరిధిలో ఉన్నాయని, స్థానిక రెవెన్యూ నిబంధనల ప్రకారమే మార్పులు జరిగాయని భావిస్తోంది. అయితే, ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్‌పై తెలంగాణ ప్రభుత్వం తన తదుపరి వాదనలను కోర్టులో వినిపించాల్సి ఉంది. గతంలో కొందరు పిటిషన్లు వేసి ఉపసంహరించుకోవడం వెనుక భారీ కుట్ర దాగి ఉందని ఏపీ ప్రభుత్వం ఆరోపిస్తుండటంతో, ఈ వ్యవహారం మరింత ముదిరేలా కనిపిస్తోంది.4,000 కోట్ల విలువైన భూమి కావడం, ఇందులో ఒక ఆధ్యాత్మిక ట్రస్ట్, ప్రైవేటు రియల్ ఎస్టేట్ సంస్థలు భాగస్వామ్యం కావడంతో ఈ కేసు తెలుగు రాష్ట్రాల్లో ఉత్కంఠ రేపుతోంది. హైకోర్టు ఇచ్చే తీర్పు రెండు రాష్ట్రాల మధ్య ఉన్న ఆస్తుల పంపకాల వివాదాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది.

# కార్యకర్తలు సరే... లీడర్లు ఏరీ

**కడప,తెలంగాణ దిశ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాబోయే ఎన్నికల్ని లక్ష్యంగా చేసుకుని తన వ్యూహాలను పునర్వ్యవస్థీకరించుకునే ప్రయత్నంలో ఉంది. ప్రధానంగా ప్రజల మధ్యకు వెళ్లడం, ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడం, వచ్చే ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి రావడం అన్నదే పార్టీ ముందున్న ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. అయితే ఈ లక్ష్యాలు కార్యరూపం దాల్చడంలో మాత్రం స్పష్టత కొరవడినట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని పార్టీ నిర్ణయించినప్పటికీ, ఆ ఉద్యమాలు పరిమిత స్థాయిలోనే కొనసాగుతున్నాయి. ఎక్కువగా కార్యకర్తలు, స్థానిక నాయకులకే ఈ బాధ్యతలు అప్పగించడంతో ప్రజల్లోకి బలమైన సంకేతం వెళ్లడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దాదాపు గత ఇరవై నెలలుగా




పార్టీ చేపట్టిన పలు కార్యక్రమాల్లో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రత్యక్షంగా పాల్గొనకపోవడం గమనార్హం. అంతేకాదు, ఆయనకు సన్నిహితుడిగా భావించే సీనియర్ నేత సజ్జల రామకృష్ణారెడ్డి కూడా ఈ కార్యక్రమాల్లో ఎక్కడా కనిపించలేదు.ఈ పరిస్థితుల్లో పార్టీ పోరాటాలు కేవలం కార్యకర్తల స్థాయికే పరిమితమయ్యాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల మధ్యకు వస్తానని జగన్మోహన్ రెడ్డి గతంలో రెండు సార్లు తేదీలు ఇచ్చారన్న ప్రచారంజరిగింది. గత ఏడాది జూలై నెలలో ప్రజల్ని కలుస్తానని చెప్పినా, అది కేవలం కొద్ది సమయం పర్యటనకే పరిమితమైంది. ఆ తర్వాత ఈ ఏడాది జనవరి నుంచి విస్తృతంగా ప్రజల్లోకి వస్తానన్న మాట కూడా వాయిదా పడింది. తాజాగా పార్టీ వర్గాల్లో పాదయాత్రే తుది నిర్ణయం అన్న చర్చ నడుస్తోంది.అయితే ఈ పాదయాత్ర ఎప్పుడు అనే దానిపై స్పష్టత లేదు. పార్టీ నాయకుల మాటల్లో చెప్పాలంటే 2027 లేదా 2028 వరకూ దీనికి ముహూర్తం ఉండకపోవచ్చని అంటున్నారు. ఇప్పుడే పాదయాత్ర చేపట్టినా ఎన్నికలకు ఇంకా సమయం ఎక్కువగా ఉండటంతో దాని ప్రభావం తగ్గిపోతుందనే ఆలోచనతోనే ఈ నిర్ణయం తీసుకుంటున్నారని సమాచారం. అందుకే ఎన్నికలకు ఒకటి లేదా రెండు సంవత్సరాల ముందు మాత్రమే పాదయాత్ర ప్రారంభించే యోచనలో ఉన్నారని చెబుతున్నారు .ఇదిలా ఉండగా, మధ్యలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు , కార్పొరేషన్ ఎన్నికలు పార్టీకి కీలకంగా మారనున్నాయి. ఈ ఎన్నికల్లో వైసీపీ ఎలా ముందుకు సాగుతుంది, ఎలాంటి వ్యూహాలు అమలు చేస్తుందన్నది పెద్ద ప్రశ్నగా మారింది. పైగా జగన్మోహన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై కూడా చర్చ సాగుతోంది. ఆయన మోకాళ్ల సమస్యతో పాటు నడుము నొప్పితో బాధపడుతున్నారని ప్రచారం ఉంది. బహిరంగంగా చెప్పకపోయినా, గత కొన్నేళ్లుగా ఆయన వ్యవహార శైలిని గమనిస్తే ఆరోగ్య ఇబ్బందులు ప్రభావం చూపుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది

### టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ను సన్మానించిన శశి భూషణ్ కాచే



మంథని: రాబోయే మున్సిపల్ ఎన్నికలపై చర్చించేందుకు హైదరాబాద్‌లో టీపీసీసీ ఎన్నికల సంఘం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సమావే శంలో మంథని పట్టణానికి చెందిన టిపిసిసి ఎన్నికల సంఘం సమన్వయ కమిటీ సభ్యులు శశి భూషణ్ కాచే పాల్గొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ సభ్యులందరికీ మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ ను శశి భూషణ్ కాచే శాలువాతో ఘనంగా సన్మానించారు.

# సంపన్నుల సంపద భయం!

### తమ పై పన్నులేయాలంటూ బహిరంగ లేఖ
### కార్పొరేట్ల నుండి దావోస్‌లో సంతకాల సేకరణ
### వెబ్‌సైట్ పెట్టి ప్రచారం

'సంపద ఒక వైపు కేంద్రీకృతమయ్యే కొద్దీ మరోవైపు పేదరికం, అభద్రత, పేదరికం పెరుగుతాయి. ఈ ప్రక్రియ కార్మిక వర్గంలో అశాంతి, ఆగ్రహం, విప్లవ చైతన్యాన్ని పెంచుతుంది' కొన్ని వందల సంవత్సరాల క్రితం కారల్ మార్క్స్ చెప్పిన మాట ఇది! సరళీకరణ ఆర్థిక విధానల ఫలితంగా మన దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో ప్రస్తుతం పెరుగుతున్న అంతరాల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.శతకోటీశ్వరుల సంపద అనూహ్యంగా పెరుగుతుండగా, సామాన్యుల రోజువారీ జీవనం కూడా కష్టమవుతున్న పరిస్థితులు చూస్తున్నాం. ఈ పరిస్థితి సంపన్నుల్లో సైతం ఆందోళనకు దారి తీస్తోందా? కార్మికవర్గం జీవన భద్రతను కూడా కోల్పోతే తిరుగుబాటు అనివార్యమన్న మార్క్స్ చెప్పిన మాట వారిని భయపెడుతోందా? దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరైన కొందరు శతకోటీశ్వర్లు తమపై తక్షణమే సంపద పన్ను విధించాలంటూ వివిధ దేశాల ప్రభుత్వాలను కోరుతూ విడుదల చేసిన బహిరంగ లేఖ ఇటువంటి అనుమానాలనే కలిగిస్తోంది. 24 దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 400 మంది సంపన్నులు ఆ లేఖపై సంతకాలు చేశారు. అంతటితో ఆగకుండా 'టైమ్ టు విన్ ' పేరిట ఒక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసి ప్రపంచవ్యాప్తంగా ఉన్న శతకోటీశ్వరు లను సంతకాలు చేయాలని కోరుతున్నారు. సంపద పన్నును విధించాలన్న డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోని విషయం తెలిసిందే. తాజాగా విడుదలైన లేఖపై సైతం మన దేశానికి చెందిన శత కోటీశ్వరులు ఎవ్వరూ సంతకాలు చేయకపోవడం గమనార్హం.




లేఖలో ఏముంది?: 'దావోస్‌కు హాజరైన మిత్రులారా×మనందరికీ ఇది గెలిచే సమయం' అన్న పేరుతో ఈ లేఖ విడులైంది. 'అత్యంత ధనికులు, మిగిలిన వారి మధ్య అంతరం రోజురోజుకి పెరుగుతోంది. పొరుగనే ఉన్న కాలనీల నుండి దేశాల వరకు ఈ చీలిక విస్తరించింది. ప్రపంచంలోని అత్యంత ధనికులపై ఒక్కశాతం మంది 95 శాతం మంది జనాభ వద్ద ఉన్న సంపద కన్నా ఎక్కువ పోగేసుకున్నారు. ఈ కొద్దిమంది ప్రజాస్వామ్యాలను కొనుగోలు చేశారు. ప్రభుత్వాలను ఆధీనంలోకి తీసుకున్నారు. మీడియా గొంతు నొక్కారు. సాంకేతికత, ఆవిష్కరణలపై పట్టు సాధించారు. పేదరికం, సామాజిక వెలివేతను మరింతగా పెంచుతున్నారు. మా లాంటి కొద్ది మంది వద్ద పోగుపడుతున్న సంపద సమాజాన్ని ప్రమాదపు అంచున నిలిపిందన్న దానిలో సందేహమే లేదు. అధిక సంపద కొద్ది మందికి అతి నియంత్రణకు అవకాశం ఇచ్చింది. అది మన భద్రమైన భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతొంది. ఇప్పుడు ఆ నియంత్రణకు ముగింపు పలకాల్సిన సమయం వచ్చేసింది. అత్యంత ధనికులపైన అంటే మాపైన పన్ను వేయండి. ఇది ప్రజాస్వామ్యాన్ని తిరిగి పొందడానికి దోహద పడుతుంది.' అని లేఖలో వారు పేర్కొన్నారు.

# ఏపీలో కొత్త పార్టీలు

**విజయవాడ,తెలంగాణ దిశ :** ఏపీలో కొత్త పార్టీలు రానున్నాయా? ఆ స్పేస్ ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం ఏపీలో ప్రాంతీయ పార్టీల హవా నడుస్తోంది. జాతీయ పార్టీల ప్రభావం అంతంత మాత్రమే. అధికార టిడిపి, జనసేనలు ప్రాంతీయ పార్టీలు. వాటితో అధికారం పంచుకున్న బిజెపి జాతీయ పార్టీ. మరో ప్రతిపక్ష పార్టీగా వైసీపీ ఉంది. అది సైతం ప్రాంతీయ పార్టీ. ఇంకా చిన్నచితకా పార్టీలు ఉండనే ఉన్నాయి. అయితే ఇప్పుడు ప్రాంతీయ పార్టీల ఏర్పాటు అంశం అనేది హాట్ టాపిక్ అవుతోంది. ప్రధానంగా ఏబీ వెంకటేశ్వరరావు, విజయసాయిరెడ్డి, షర్మిలాలు కొత్త పార్టీలు పెడతారని ప్రచారం నడుస్తోంది. అయితే ఈ ముగ్గురు పార్టీలు పెడితే ఎవరికి నష్టం అంటే మాత్రం..

కచ్చితంగా జగన్మోహన్ రెడ్డికి. అయితే ఆ ముగ్గురు టార్గెట్ సైతం జగన్మోహన్ రెడ్డి పార్టీ అని తెలుస్తోంది. వారి పార్టీల ఏర్పాటు వెనుక కూడా ఒక రకమైన వ్యూహం ఉన్నట్లు సమాచారం. అయితే వారి పార్టీ ప్రకటన నేరుగా లేదు కానీ ప్రచారం మాత్రం జరుగుతోంది.ఏబీ వెంకటేశ్వరరావుజగన్మోహన్ రెడ్డి సర్కార్ బాధిత అధికారి. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి సర్కార్లు ఆయన ఇంటలిజెన్స్ అధికారిగా పనిచేశారు. అప్పట్లో వైసీపీ ఎమ్మెల్యేలు చాలామంది టీడీపీలో చేరారు. ఆ సమయంలో నిఘా అధిపతిగా ఉన్న ఆయన టిడిపికి అనుకూలంగా పనిచేశారన్న అనుమానం జగన్ లో ఉండేది. అందుకే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బాధితుడిగా మారారు ఏబీ వెంకటేశ్వరరావు. ఈ రాష్ట్రానికి డిజిపి కావాల్సిన అధికారి లూప్ హోల్స్ లో ఉండిపోయారు. ప్రమోషన్ పొందిన నాడే పదవీ విరమణ చేశారు. అయితే ఇంతటి మూల్యాన్ని చెల్లించుకున్న తనకు తెలుగుదేశం అధికారంలోకి వస్తే మంచి గుర్తింపు ఉంటుందని భావించారు. అయితే తన ఆలోచనకు తగ్గట్టు టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత గుర్తింపు, పదవి దక్కలేదు. పైగా తాను ఆశించినట్టు వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డికి ట్రీట్మెంట్ ఇవ్వడం లేదన్న ఆవేదన ఉంది. మరోవైపు తెలుగుదేశం పార్టీలో చేరేందుకు సైతం తనకు ఇబ్బందులు ఉన్నాయి. అందుకే ఆయన కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తానని ఇటీవల ప్రకటించారు.మరోవైపు విజయసాయిరెడ్డికొత్త పార్టీ పెడతారన్న ప్రచారం నడుస్తోంది. ఏడాది కిందట ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. రాజ్యసభ సభ్యత్వంతో పార్టీకి కూడా రాజీనామా చేశారు. ఇకనుంచి వ్యవసాయం చేసుకుంటానని చెప్పుకొచ్చారు.. అయితే ఆయన రూటు మార్చినట్టు కనిపిస్తున్నారు. ఇటీవల నిత్యం జగన్ కోటరిని టార్గెట్ చేసుకుంటున్నారు. ఈ క్రమంలో రెడ్డి సామాజిక వర్గాన్ని ఆకర్షించే వీలుగా ఒక కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయాలన్న ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. దీని వెనుక తెలుగుదేశం హస్తం ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. వచ్చే ఎన్నికల్లో మరోసారి రెడ్డి సామాజిక వర్గం మద్దతు జగన్మోహన్ రెడ్డికి దక్కకుండా విజయసాయిరెడ్డి తో పార్టీని ఏర్పాటు చేయిస్తున్నారన్న ప్రచారం మాత్రం జరుగుతోంది.వైయస్ షర్మిల కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెబుతారని కూడా టాక్ నడుస్తోంది. తెలంగాణలో తన తండ్రి పేరిట పార్టీ ఏర్పాటు చేసిన షర్మిల అక్కడ నడపలేకపోయారు. కాంగ్రెస్ పార్టీలో చేరి ఏపీ పగ్గాలు అందుకున్నారు. సోదరుడు జగన్తో వచ్చిన విభేదాలతో ఆయనను అధికారం నుంచి దూరం చేయాలని చూసారు.

ఆ విషయంలో సక్సెస్ అయిన ఏపీలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కాలేదు. అందుకే కాంగ్రెస్ అధినాయకత్వం షర్మిలను తప్పిస్తుందన్న ప్రచారం నడుస్తోంది. ఈ తరుణంలో ఆమె ప్రత్యేక రాయలసీమ సాధన కోసం ఒక పార్టీని ఏర్పాటు చేస్తారని టాక్ నడుస్తోంది. ఇటీవల రాజకీయంగా యాక్టివిటీస్ తగ్గించారు షర్మిల.

అందుకే ఈ ప్రచారం మరింతగా సాగుతోంది. అయితే వీరు రాజకీయ పార్టీలు ఏర్పాటు చేస్తారు అనేది ఒక్క ప్రచారం మాత్రమే. వారు పార్టీలు ఏర్పాటు చేస్తే మాత్రం అది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇబ్బంది కలిగించే విషయమే.

# వెడ్డింగ్ హబ్ గా తిరుపతి



**తిరుపతి,తెలంగాణ దిశ :** కలియుగ ప్రత్యక్ష దైవంగా భక్తులు భావించే వేంకటేశ్వర స్వామి కొలువైన తిరుమల లో వివాహం చేసుకోవడం అత్యంత పవిత్రమని చాలామంది విశ్వసిస్తారు. ఆ పవిత్ర వాతావరణంలో కొత్త జీవితం ప్రారంభిస్తే దాంపత్య జీవితం సుఖశాంతులతో, ఆరోగ్యంగా సాగుతుందని భక్తుల నమ్మకం. ప్రపంచ వ్యాప్తంగా పేరుగాంచిన ఆధ్యాత్మిక క్షేత్రం కావడంతో, అక్కడి ఆధ్యాత్మిక వాతావరణం వివాహ జీవితానికి శుభకారకమని భావిస్తారు. ఏడుకొండల వాడి సన్నిధిలో జరిగే పెళ్లిని ఎంతో పవిత్రంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు గౌరవిస్తారు.ఈ నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తిరుమల?తిరుపతి ప్రాంతాన్ని వివాహాల కోసం ప్రత్యేక గమ్యస్థానంగా అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఇటీవల సంక్రాంతి పండుగ సందర్భంగా తన స్వగ్రామం నారావారిపల్లె కు వెళ్లిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుపతిని వెడ్డింగ్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దే దిశగా అధికారులకు సూచనలు చేసినట్లు తెలుస్తోంది.ముఖ్యమంత్రి ఆదేశాలతో తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు, పర్యాటక శాఖ కలిసి ప్రత్యేక ప్యాకేజీపై కసరత్తు చేస్తున్నారని సమాచారం. ప్రస్తుతం తిరుమలలో ఏటా సుమారు పదిహేను వేల నుంచి ఇరవై వేల వరకు వివాహాలు జరుగుతున్నాయి. శుభ ముహూర్తాలు ఉన్న రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. తిరుపతి , తిరుచానూరు ప్రాంతాల్లో జరిగే పెళ్లిళ్లు వీటికి అదనమే.ఇప్పటికే టీటీడీ వివాహాలు చేసుకునే జంటలకు కొన్ని సౌకర్యాలు అందిస్తోంది.

'కళ్యాణ వేదిక' లో వివాహం చేసుకున్న వారికి ప్రత్యేక దర్శన అవకాశం, ఆశీర్వచన కార్యక్రమం, ప్రసాదాల పంపిణీ వంటి సదుపాయాలు ఉన్నాయి. అయితే ఈ వేదికలో ఆర్భాటాలకు అవకాశం తక్కువగా ఉండటంతో, కొందరు భక్తులు కొండపై ఉన్న ప్రైవేటు మఠాలు, సత్రాలు లేదా దిగువ ప్రాంతాల్లోని కల్యాణ మండపాలను ఎంచుకుంటున్నారు. తొండవాడ , శ్రీనివాసమంగాపురం వంటి ప్రాంతాలు కూడా పెళ్లిళ్లకు ప్రాధాన్యం పొందుతున్నాయి. అయితే ఈ విధంగా ఇతర చోట్ల వివాహాలు చేసుకునే వారికి ఇప్పటివరకు ప్రత్యేక దర్శన సౌకర్యాలు లేకపోవడం వల్ల భక్తుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ అంశం ప్రభుత్వ దృష్టికి రావడంతో, ఇకపై కళ్యాణ వేదిక వెలుపల పెళ్లి చేసుకున్నా కూడా శ్రీవారి దర్శనం, ఆశీర్వచనం, ప్రసాదాలు అందించే విధంగా కొత్త విధానం తీసుకురావాలని యోచిస్తోంది.వివాహ వేదిక అలంకరణ, భోజన ఏర్పాట్లు, రవాణా, వసతి వంటి సేవలను ప్రైవేటు సర్వీసు ప్రొవైడర్లకు అప్పగించి, ప్రభుత్వ పర్యవేక్షణలో ప్యాకేజీగా అందించా లని ప్రతిపాదనలు రూపొం దిస్తున్నారు. దీని వల్ల పెళ్లి చేసుకునే వారికి సౌలభ్యం కలగడంతో పాటు, స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలుపితే, తిరుమల?తిరుపతి ప్రాంతం ఆధ్యాత్మికతతో పాటు వివాహాల కోసం కూడా దేశవ్యాప్తంగా మరింత గుర్తింపు పొందే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

# 'ది రాజాసాబ్' డిజాస్టర్ తర్వాత మారుతీ కొత్త ప్లాన్..!



టాలీవుడ్‌లో కామెడీ ఎంటర్‌టైనర్లతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు మారుతీ, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో కలిసి తెరకెక్కించిన చిత్రం ది రాజాసాబ్. హారర్ అండ్ థ్రిల్లర్ జానర్‌లో రూపొందిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా భారీ అంచనాల మధ్య విడుదలైంది. అయితే, ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోవడంతో ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘోరమైన డిజాస్టర్‌గా నిలిచింది. ప్రభాస్ అభిమానులు కూడా ఈ సినిమాపై పెద్దగా పాజిటివ్ స్పందన ఇవ్వకపోవడం గమనార్హం. ఈ వైఫల్యంతో దర్శకుడు మారుతీపై సోషల్ మీడియాలో తీవ్ర స్థాయిలో ట్రోలింగ్ జరిగింది. దీంతో ఆయన తదుపరి సినిమా ఏ హీరోతో ఉంటుందనే అంశంపై ఇండస్ట్రీలో పెద్ద చర్చ మొదలైంది. మొదట్లో మారుతీ తన నెక్ట్స్ ప్రాజెక్ట్‌ను మెగాస్టార్ చిరంజీవితో చేయబోతున్నాడనే వార్తలు హల్‌చల్ చేశాయి. కానీ ప్రస్తుతం చిరంజీవి మూడు సినిమాలతో బిజీగా ఉండటంతో ఆ ప్రాజెక్ట్‌కు బ్రేక్ పడినట్లు సమాచారం. తాజా సమాచారం ప్రకారం, మారుతీ తన కంబ్యాక్ మూవీని మెగా హీరో వరుణ్ తేజ్‌తో చేయాలని ఫిక్స్ అయినట్లు టాలీవుడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఇటీవలే వరుణ్ తేజ్‌ను కలిసిన మారుతీ, ఆయనకు పూర్తి కథను వినిపించాడట. మారుతీ స్టయిల్‌కు తగ్గట్టుగా పక్కా కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ కథకు వరుణ్ తేజ్ వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ సినిమా భలే భలే మగాడివోయ్ తరహాలో ఫ్యామిలీ ఆడియన్స్‌కు కూడా కనెక్ట్ అయ్యేలా, నవ్వులు పంచే ఎంటర్‌టైనర్‌గా ఉండబోతుందని సమాచారం. ఈ ప్రాజెక్ట్‌ను యూవీ క్రియేషన్స్ నిర్మించనున్నట్లు టాక్. త్వరలోనే ఈ సినిమాపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది. వరుణ్ తేజ్ ప్రస్తుతం దర్శకుడు మేర్లపాక గాంధీతో కొరియన్ కనకరాజు అనే ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్నారు. ఈ సినిమా సమ్మర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఆ సినిమా విడుదల అనంతరం మారుతీ దర్శకత్వంలో తెరకెక్కే ఈ కొత్త ప్రాజెక్ట్ ప్రారంభమయ్యే అవకాశం ఉందని సమాచారం. ది రాజాసాబ్ ఫెయిల్యూర్ తర్వాత మారుతీకి ఈ వరుణ్ తేజ్ సినిమా చాలా కీలకంగా మారింది. తనకు పేరు తెచ్చిన కామెడీ జానర్‌లో మళ్లీ బలమైన కథతో ప్రేక్షకుల ముందుకు రావాలని మారుతీ ప్లాన్ చేస్తున్నాడట. ఈ సినిమాతో అయినా ఆయన గట్టి కంబ్యాక్ ఇస్తాడా? లేదా అన్నది చూడాల్సి ఉంది. మెగా హీరోతో కలయిక, యూవీ క్రియేషన్స్ బ్యానర్.. ఈ కాంబినేషన్‌పై టాలీవుడ్‌లో అంచనాలు ఇప్పటికే పెరుగుతున్నాయి.





# బిగ్ బాస్ ఫేం రీతూ చౌదరి పెళ్లి, బ్రేకప్‌పై ఓపెన్



బిగ్ బాస్ తెలుగు షో ద్వారా ప్రేక్షకులకు అలరించిన రీతూ చౌదరి, తన వ్యక్తిగత జీవితం, కెరీర్, ప్రేమ వ్యవహారాలపై ఇటీవల ఓ ఇంటర్వ్యూలో క్లారిటీ ఇచ్చారు. అభిమానులు చాలా రోజులుగా ఆమె పెళ్లి, బ్రేకప్ మరియు లైఫ్ స్టైల్ గురించి తెలుసుకోవాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఆమె వివరించిన అంశాలు ప్రేక్షకులకు కొత్త క్లారిటీని ఇచ్చాయి. రీతూ గతంలో శ్రీకాంత్ అనే వ్యక్తిని తనకు కాబోయే భర్తగా పరిచయం చేసిన విషయం తెలిసిందే. ఈ కాబోయే వివాహానికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో హల్చల్ సృష్టించాయి. అయితే రీతూ తాజాగా నేను, శ్రీకాంత్ ఏడాది పాటు రిలేషన్‌లో ఉన్నాము. "నా మెంటాలిటీ అతని మెంటాలిటీ సెట్ కాలేదు. దాన్ని పెళ్లి అని నేను అనుకోను," అని ఆమె చెప్పారు. బ్రేకప్ కారణాలు వ్యక్తిగతమైనవి, అందువల్ల ఆమె దానిపై స్పష్టంగా చెప్పలేను అని పేర్కొన్నారు. రీతూ తన లైఫ్‌లో సింగిల్‌గా ఉండడంలో సంతోషంగా ఉన్నారని చెప్పారు. లైఫ్ లాంగ్ సింగిల్‌గా ఉంటా. మా నాన్న లాంటి వారు దొరికితే ఆలోచిస్తా అని ఆమె తెలిపారు. రిలేషన్‌షిప్ ఒక మెంటల్ టార్చర్, డిప్రెషన్, టాక్సిక్ ట్రామా అని ఆమె భావనను పంచుకున్నారు. బిగ్ బాస్ హౌస్‌లో డీమాన్ పవన్ ,రీతూ మధ్య ఎమోషన్స్ హాట్ టాపిక్‌గా మారడం మనం చూశాం. అయితే షో తరువాత కూడా రీతూ–పవన్ మధ్య రిలేషన్ కొనసాగుతుందన్న అనుమానాలు ఉన్నా, దీనిపై క్లారిటీ లేదు. రీతూ చౌదరి వ్యక్తిగతజీవితంలో స్పష్టమైననిర్ణయాలు తీసుకోవడం, సంబంధాలను గురించి నిజాయితీగా మాట్లాడడం అభిమానులకు అవగాహన కలిగించింది. జబర్దస్త్‌తో జనాలని పలకరించిన ఈ ముద్దుగుమ్మ ఇప్పుడు బిగ్ బాస్ షోతో అందరికి దగ్గరైంది.

# లవర్ బాయ్ అబ్బాస్ రీ ఎంట్రీ..



ఒకప్పుడు తెలుగు, తమిళ సినీ ప్రేక్షకుల హృదయాలను దోచుకున్న లవర్ బాయ్ హీరో అబ్బాస్ మళ్లీ వెండితెరపై కనిపించేందుకు సిద్ధమ య్యాడు. ప్రేమదేశం, రాజా, నరసింహ, శ్వేతనాగు వంటి సూపర్ హిట్ చిత్రాలతో యువతలో ప్రత్యేకమైన ఇమేజ్ సంపాదించుకున్న అబ్బాస్, హీరోగా మాత్రమే కాకుండా క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కూడా ప్రేక్షకులను మెప్పించాడు. అయితే 2014 తర్వాత సినిమాలకు దూరమైన ఆయన, విదేశాల్లో ఉద్యోగం చేస్తూ సాధారణ జీవితాన్ని కొనసాగించారు. ఇన్నేళ్ల గ్యాప్ తర్వాత అబ్బాస్ సినిమాల్లోకి రీ ఎంట్రీ ఇస్తుండటం అభిమానుల్లో ఆనందాన్ని నింపింది. అబ్బాస్ తిరిగి నటిస్తున్న సినిమా 'హ్యాపీ రాజ్'. తమిళ్ హీరో,సంగీత దర్శకుడు జివి ప్రకాష్ కుమార్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీ గౌరీ ప్రియా హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి విడుదల కానుంది. హ్యాపీ రాజ్ తెలుగు ప్రోమోను తాజాగా మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ ప్రోమోచూస్తే సినిమా మొత్తం లవ్ అండ్ కామెడీ జానర్‌లో సాగనున్నట్టు స్పష్టమవుతోంది. ఇందులో అబ్బాస్, హీరోయిన్ శ్రీ గౌరీ ప్రియ తండ్రి పాత్రలో నటిస్తున్నారు. ఆయన పాత్రలో కామెడీతో పాటు భావోద్వేగాలు కూడా ఉంటాయని ప్రోమో ద్వారా తెలుస్తోంది. ఈ చిత్రం ఒక ప్రేమ జంట చుట్టూ తిరిగే కథగా తెరకెక్కుతోంది. ప్రేమ, పెళ్లి, ఆతర్వాత వారి జీవితంలో వచ్చే అపా ర్థాలు, గొడవలు అన్ని అంశాలను లవ్ కామెడీగా చూపించనున్నారని సమాచారం. ప్రోమోలోని సరదా సన్నివేశాలు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ప్రస్తుతం హ్యాపీ రాజ్ సినిమా షూటింగ్ దశలో ఉంది. జివి ప్రకాష్ హీరోగా నటించడంతో పాటు సంగీతం అందిస్తుం డటంతో సినిమాపైఅంచనాలు పెరుగుతున్నాయి. అబ్బాస్ఈ సినిమా తో రీ ఎంట్రీ ఇస్తుండటంతో ఆయన అభిమానులు సోషల్ మీడియాలో ఆనందంవ్యక్తం చేస్తున్నారు. చాలాఏళ్ల తర్వాత అబ్బాస్‌నుమళ్లీ వెండితె రపై చూడబోతుండటం ఆయన అభిమానులకు పెద్ద సర్‌ప్రైజ్‌గా మారింది. హీరోగా ఫేమ్ తెచ్చుకున్న అబ్బాస్, ఇప్పుడు క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కొత్త ఇన్నింగ్స్ మొదలుపెట్టడం ఆసక్తికరంగా మారింది.

# బిగ్ బాస్ బ్యూటీ సంచలన కామెంట్స్



తెలుగు ప్రేక్షకులకు 'శ్రీ సత్య' గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. విజయవాడ అమ్మాయిగా మిస్ విజయవాడ టైటిల్ గెలిచి, మిస్ ఆంధ్రా పోటీల్లో మెరిసి ఆ తర్వాత టెలివిజన్ రంగంలోకి అడుగుపెట్టిన ఆమె ప్రయాణం చాలామందికి ఇన్స్పిరేషన్‌గా నిలుస్తోంది. స్వభావానికి పూర్తిగా ఇంట్రోవర్ట్ అయినప్పటికీ ఈ రంగాన్ని ఎందుకు ఎంచుకున్నాననే విషయాన్ని తాజాగా ఆర్జే కాజల్‌తో జరిగిన ఓ పాడ్‌కాస్ట్‌లో ఓపెన్‌గా వెల్లడించింది. తన కెరీర్ ఆరంభానికి ప్రధాన కారణం తన ఫేవరెట్ హీరో రామ్ పోతినేనినే అని సత్య చెప్పింది. "రామ్ గారు 17 ఏళ్లకే ఇండస్ట్రీలోకి వచ్చారు. అది చూసి నేను కూడా ఇంటర్ తర్వాత చదువు ఆపేసి సినిమాల్లోకి వెళ్తానని ఇంట్లో చెప్పాను. ఆ సమయంలో అమ్మ చాలా కోపపడింది, నాతో మాట్లాడడం కూడా మానేసింది. కానీ నాన్న మాత్రం నన్ను ఎంకరేజ్ చేశారు" అంటూ తన మనసులోని మాటలను పంచుకుంది. టీవీలో మిస్ విజయవాడ పోటీల ప్రకటన చూసిన తండ్రే ముందుగా ప్రయత్నించమని చెప్పారని తెలిపింది. దాదాపు 300 మంది పాల్గొన్న ఆడిషన్‌లో తాను సెలక్ట్ కాను అనే నమ్మకం తనకు ఉందని, కానీ హాస్టల్‌కు తిరిగి వెళ్లిన తర్వాత సెలక్ట్ అయ్యానని ఫోన్ రావడం తన జీవితంలో కీలక మలుపు అని చెప్పింది. చివరకు 11 మందిలో విజేతగా నిలవడంలో తన సమాధానాలే కారణమని, ఆ రోజు గెస్ట్‌గా ఉన్న శివాజీ గారు తన జవాబులు నచ్చడంతో విన్నర్‌గా ప్రకటించారని గుర్తు చేసుకుంది. వ్యక్తిగత జీవితంపై కూడా సత్య ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. నటి అంజలి కుమార్తె ధాన్వితో తనకు ఏర్పడిన అనుబంధం గురించి మాట్లాడుతూ, చిన్న పిల్లలంటే తనకు చాలా ఇష్టమని చెప్పింది. "మన చుట్టూ చాలా మంది పిల్లలు ఉన్నప్పుడు మనకంటూ ప్రత్యేకంగా పిల్లలు ఉండాల్సిన అవసరం ఏముంది?"

అనే తన ఆలోచనను వెల్లడించింది. అయితే తాను అమ్మ అవ్వాలని మాత్రం కోరుకుంటున్నానని, పెళ్లి చేసుకోకుండానే దత్తత ద్వారా ఓ అమ్మాయిని తీసుకుంటానని స్పష్టంగా చెప్పింది. మగ పిల్లాడిని మాత్రం తాను హ్యాండిల్ చేయలేనని సరదాగా వ్యాఖ్యానించింది. ధ్యానం, నమ్మకాల విషయానికి వస్తే, ఇటీవల శివ మాల, భైరవ మాల ధరించడం వెనుక బలమైన కారణం ఉందని చెప్పింది.

ఓ ప్రమాదంలో ప్రాణాపాయం నుంచి తృటిలో తప్పించుకున్న తర్వాత తన జీవితంపై దృష్టి మారిందని, అప్పటి నుంచే శివ మాల ధరించాలనే నిర్ణయం తీసుకున్నానని వెల్లడించింది. "ఆడపిల్ల భైరవ మాల వేస్తావా అని చాలామంది అడిగారు. కానీ నేను నిష్టతో వేసుకున్నాను" అని చెప్పింది. ప్రస్తుతం శ్రీ సత్య 'బీబీ జోడి 2'లో పాల్గొంటూ అర్జున్ కళ్యాణ్‌తో కలిసి డ్యాన్స్ చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. సాధారణ అమ్మాయిగా మొదలైన ఆమె ప్రయాణం, తన ఆలోచనలు, నిర్ణయాలు ఈ పాడ్‌కాస్ట్ ద్వారా మరోసారి అభిమానులను ఆకట్టుకున్నాయి.

# 'ఈ నగరానికి ఏమైంది' సీక్వెల్‌లో శ్రీనాథ్ మాగంటి



టాలీవుడ్‌లో వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ నటుడు శ్రీనాథ్ మాగంటి ఇప్పుడు ఒక భారీ ప్రాజెక్టులో భాగం కాబోతున్నాడు. 'హిట్' ఫ్రాంచైజీలో అభిలాష్‌గా, ఇటీవలి 'లక్కీ భాస్కర్'లో సూరజ్‌గా మెప్పించిన ఆయన, సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలోని 'యానిమల్' సినిమాతో బాలీవుడ్‌లోనూ తన ముద్ర వేశారు. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం, తరుణ్ భాస్కర్ తెరకెక్కించిన కల్ట్ క్లాసిక్ 'ఈ నగరానికి ఏమైంది' సీక్వెల్‌లో శ్రీనాథ్ మాగంటి హీరోగా నటించబోతున్నట్లు తెలుస్తుంది. ఈ సీక్వెల్ కోసం ఇప్పటికే స్క్రిప్ట్ పనులు పూర్తయ్యాయని, మొదటి భాగంలాగే ఇది కూడా వాస్తవ ఘటనల ఆధారంగా స్నేహబంధం నేపథ్యంలో సాగుతుందని తెలుస్తోంది. ఈ సీక్వెల్‌లో ఉండటం లేదని తరుణ్ భాస్కర్ఇప్పటికే స్పష్టం చేశారు. సుశాంత్ లేకపోయినా కార్తీక్ పాత్ర ప్రయాణం కొనసాగుతుందని ఆయన పేర్కొనడంతో, ఇప్పుడు ఆ కీలక బాధ్యతను శ్రీనాథ్ మాగంటి భుజానికెత్తుకోబోతున్నారా అనే ఆసక్తి నెలకొంది.

# 'వారణాసి'తో వరల్డ్ సినిమా లక్ష్యం..

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కలయికలో తెరకెక్కుతున్న పాన్ వరల్డ్ చిత్రం 'వారణాసి' పై అంచనా లు రోజురోజుకీ పెరుగుతున్నాయి. భారతీయ సినిమాను అంతర్జాతీ య స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో రాజమౌళి ఈ ప్రాజెక్ట్‌ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందిస్తున్నారు. హాలీవుడ్ ప్రమాణాలకు తగ్గ సాంకేతిక విలువలు, కథనంతో ఈ సినిమాను నిర్మించనున్నట్లు ఇప్పటికే ఇండస్ట్రీ వర్గాల్లో బలమైన చర్చ నడుస్తోంది. సుమారు రూ.1300 కోట్లకు పైగా బడ్జెట్‌తో 'వారణాసి'ను రూపొందిస్తున్నట్లు సమాచారం. ఇది భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ప్రాజెక్ట్ లలో ఒకటిగా నిలవనుంది. ఈ సినిమాను పూర్తిగా ఫార్మాట్లో చిత్రీకరి స్తుండటం విశేషం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులను లక్ష్యంగా చేసుకుని, ఈ చిత్రాన్ని అనేక భాషల్లో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా ప్రియాంక చోప్రా నటిస్తున్న విషయం తెలిసిందే హాలీవుడ్ అనుభవం ఉన్న ప్రియాంక పాత్ర సినిమాకు అంతర్జాతీయ ఆకర్షణను తీసుకురానుంది. తాజాగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి మరో ఆసక్తికర విషయం బయటకు వచ్చింది. మహేష్ బాబు పాత్రతో పాటు సినిమాలో ఒక స్పెషల్ నెగటివ్ క్యారెక్టర్ కూడా ఉండబోతుందని, ఆ పాత్రకు ఓ ప్రముఖ బాలీవుడ్ నటుడు ఎంపికైనట్లు ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. ఈ పాత్ర కథలో కీలక మలుపులు తిప్పేలా ఉంటుందని సమాచారం. 'వారణాసి'కి రాజమౌళి రెగ్యులర్ టీమ్ పని చేస్తుండటం సినిమాపై నమ్మకాన్ని మరింత పెంచుతోంది. మూవీకి ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తుండగా, కథ విజయేంద్ర ప్రసాద్ అందించారు. ఇప్పటికే విడుదలైన టీజర్ దేశవ్యాప్తంగా విశేష స్పందనను తెచ్చుకుంది. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, మహేష్ బాబు లుక్ అన్ని కలిపి సినిమా స్థాయిని పెంచాయి. 'బాహుబలి', 'ఆర్‌ఆర్‌ఆర్'తో భారతీయ సినిమాను ప్రపంచ పటంలో నిలిపిన రాజమౌళి, ఇప్పుడు 'వారణాసి'తో ఆ స్థాయిని మరింత పెంచాలని చూస్తున్నారు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215